J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 25 24.11.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



### బాబుకి.. బెయిలు

# గెలిచిందెవరు.. ఓడిందెవరు..?

## ఇదో మిలియన్ డాలర్ల ప్రశ్న.. కాలమే సమాధానం చెప్పాలి!

**ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు కొత్త తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. గత, ప్రస్తుత ప్రభుత్వ పాలకులు, నాయకులు అభివృద్ధి, సంక్షేమం వంటి విషయాలకి స్వస్తి చెప్పేశారు. ఘాటైన మాటలు, దుర్భాషణలు, తన్నులాటలు, నేరాలు, ఘోరాలు, జైళ్ళు, బెయిళ్ళు వంటి విషయాలకి ప్రాధాన్యత కల్పించి పరస్పర వ్యక్తిత్వ హననంలో తలమునకలుగా రాజకీయాలు చేస్తున్నారు. స్కిల్ స్కామ్ నేరంలో చంద్రబాబు అరెస్టయి జైలుకి వెళ్ళకముందు వరకు ఓ రకమైన రాజకీయం. ఇప్పుడు మరో రకమైన రాజకీయం.**

ఆరోగ్య కారణాలతో నవంబర్ 28వ తేదీ వరకు షరతులతో కూడిన బెయిలు పొందిన చంద్రబాబుకి నవంబర్ 20వ తేదీన హైకోర్టు సాధారణ బెయిలు మంజూరు చేసింది. నవంబర్29 నుండి ఆయన ఎలాంటి షరతులు లేకుండా స్వేచ్ఛగా జీవించవచ్చని చెప్పేసింది. తెలుగుదేశం పార్టీకి ఇది పెద్ద ఊరట. అసలు ఆరు నెలలవరకూ బాబుకి బెయిలే రాదని వైసీపీ శ్రేణులు అంచనా వేసుకున్న తరుణంలో ఊహించని విధంగా బాబుకు హఠాత్తుగా బెయిలు రావడమన్నది వైసీపీ శ్రేణులకు మింగుడుపడడంలేదు. ఎలాగైనా బాబుని మళ్ళీ లోపలకి పంపించాలన్న పట్టుదలతో ఆ పార్టీ అగ్రనేతలు ఉన్నారు.

ఇక్కడి నుండి అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎవరి ఎత్తులు వారు వేసుకుంటూ ప్రజాక్షేత్రంలో తమ పోరాటాలు సాగిస్తారు. బాబు బెయిలు రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం మెట్లెక్కింది. చంద్రబాబుకి 17ఏ వర్తిస్తుందని, అసలు కేసులేవీ చెల్లవని, కేసులన్నింటినీ స్క్వాష్ చేయాలని వాదిస్తూ బాబు న్యాయవాదులు కూడా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బహుశా మరో రెండు రోజుల్లో రెండు కేసుల్లోనూ సుప్రీం తమ నిర్ణయాన్ని వెలువరించవచ్చు. బాబుకి 17ఏ వర్తిస్తుందని సుప్రీం చెప్తే ఇక జైలు, బెయిలు అన్న ప్రశ్నే ఉండదు. ఆయనపై ప్రభుత్వం పెట్టదలుచుకున్న ప్రతి కేసులోనూ గవర్నర్ అనుమతి ముందుగా తీసుకోవాల్సి ఉంటుంది.

అలాకాకుండా 17ఏ ఆయనకి వర్తించదు, స్క్వాష్ కుదరదు అని తీర్పు వస్తే బాబుని కొత్త కేసులు చుట్టుకుంటాయి. స్కిల్ కేసులో బెయిలు వచ్చింది కాబట్టి మరో కేసులో అరెస్టు చేస్తామన్న వాదాన్ని అధికార పార్టీ తెరపైకి తేవచ్చు. అప్పుడు స్కిల్ స్కామ్‌లో బెయిలు రద్దు చేసినా చేయకపోయినా పెద్ద తేడా ఉండదు. మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి బెయిలు కూడా రద్దు చేయాలంటూ నరసాపురం ఎంపీ రఘురామరాజు కూడా సుప్రీంని ఆశ్రయించారు. ప్రస్తుతం బాల్ సుప్రీం కోర్టులో ఉంది. నువ్వా... నేనా అన్నట్లుగా ఇరు పక్షాలూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, గెలిచేదెవరు.. ఓడేదెవరు..? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల నుండి వినపడుతోంది.

### కేసులే ప్రధానంగా విమర్శల పర్వం!

"తెలుగుదేశం పరిపాలనలో మేము ఈ అభివృద్ధి చేశాం, మా హయాంలో పలానా ప్రాజెక్టులు నిర్మించాం, మా పాలనలో ఇన్ని పరిశ్రమలు తెచ్చాం, మా ప్రభుత్వంలో ఇంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించాం, మా టైంలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చి రైతుని రాజుని చేశాం" వంటి మాటలు ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఒక్కరోజు కూడా ఏ తెలుగుదేశం నాయకుడూ మాట్లాడలేదు. "నువ్వు ఆర్థిక నేరస్తుడివి, నీ మీద ఇన్ని కేసులున్నాయి, మా నాయకుడిని విమర్శించే హక్కు నీకు, మీ పార్టీకి లేదు".. ఇవీ ఇటీవలిదాకా తెలుగు తమ్ముళ్లు జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన విమర్శలు. ఆర్థిక నేరారోపణలతో అరెస్ట్ అయ్యి పదేళ్ళుగా బెయిలుపై ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. పద్నాలుగున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసినా తనపై ఎలాంటి నేరారోపణలు లేవు అని మొన్నటివరకు చెప్పుకుంటుండిన చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. అదే అస్త్రంగా వాడుకుంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు జగన్‌పై విమర్శలు చేస్తూ వచ్చారు.

### ఇప్పుడు సీను... రివర్సయ్యింది!

స్కిల్ స్కామ్‌లో ముద్దాయిని చేసి చంద్రబాబుని జైలుకి పంపి 52 రోజులు కారాగారంలో ఉంచి టీడీపీ శ్రేణుల నోళ్ళు మూయించడంలో తొలి అడుగు విజయవంతంగా వేసింది వైసీపీ. ఇక నేరం, ఘోరం, జైలు, బెయిలు అన్న మాటలు టీడీపీ శ్రేణులనుండి వినిపించకుండా ఉండేలా అధికారపార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించిందనడంలో సందేహం లేదు.

మీపైన కూడా కేసులు ఉన్నాయి, మీ నాయకుడు కూడా జైలుకి వెళ్లారు, చంద్రబాబు కూడా బెయిలుపైనే బయట తిరుగుతున్నారు అంటూ తిరగబడడానికి కావలసిన అస్త్రాన్ని చేజిక్కించుకుంది వైసీపీ. అక్కడితో ఆగకుండా బాబుపై కేసుల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగిస్తూనే ఉంది. మద్యం, ఇసుక, మైనింగ్ అంటూ రోజుకో కొత్త కేసుతో సీఐడీని ప్రయోగిస్తోంది. కేసులు రుజువవుతాయా.. లేదా? అన్నది తరువాతి అంశం. ప్రతి కేసులోనూ నేరం ఆరోపించిన వారు ఒకటి చెప్తారు, ఆరోపణకు గురైనవారు మరొకటి చెప్తారు, కానీ, వాస్తవానికి అసలు నిజం వేరే ఉంటుంది. అది తేలొచ్చు, తేలకపోవచ్చు. ఆ విషయం కాలం నిర్ణయిస్తుంది. ఈలోగా ఎవరికి అవసరమైన పని వాళ్ళు చేసేసుకోవచ్చు. నువ్వు దొంగ అంటే...

10లో

## ప్రథమ వర్ధంతి


జననం : 1924 నిర్యాణం : 2022

అమ్మా...
నిష్కల్మషమైన ప్రేమను పంచిన
స్వచ్ఛమైన మనసు మీది..
అడిగినవారికి లేదనకుండా
సాయంచేసిన సహృదయం మీది.
మా జీవితాలలో వెలుగులు నింపిన
అనురాగమూర్తి మీరు..
మాలో సేవాస్ఫూర్తిని వెలిగించిన
ఆత్మీయదీప్తి మీరు.

### శ్రీమతి బోగొల్లు పిచ్చమ్మ గారు

పరమపదించి తేది. 24.11.2023 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ... వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
డాక్టర్ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి - డాక్టర్ సరోజిని, నెల్లూరు
బోగొల్లు మోహన్‌రెడ్డి, మోహన్ అసోసియేట్స్ - నిర్మలమోహన్, హైదరాబాదు

మనుమళ్ళు - మనుమరాళ్ళు
బోగొల్లు సతీష్ - స్వప్న బోగొల్లు సత్యనాథ్ - సృజన
బోగొల్లు ఉదీప్ - అనిత బోగొల్లు సందీప్ - సరిత
మరియు మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు



# జగన్నాథ రథయాత్రను జయప్రదం చేయాలి

**● ఇస్కాన్ అధ్యక్షులు శుకదేవస్వామి**

కావలి పురవీధుల్లో డిసెంబరు 16వ తేదిన ఇస్కాన్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని, ఆ యాత్రను జయప్రదం చేయాలని నెల్లూరు ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శుకదేవస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల కావలి రామ్మూర్తిపేటలోని ఇస్కాన్ మందిరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఏడు సంవత్సరాలుగా కావలిలో ఈ యాత్రను వైభవంగా నిర్వహిస్తున్నామని, 'శ్రీ గౌర నితాయ్ రథయాత్ర' పేరుతో జరిగే ఈ యాత్ర, ఆరోజు మధ్యాహ్నం స్థానిక ఆర్‌వీఎస్‌ఆర్ కల్యాణమండపం నుంచి ప్రారంభమై పురవీధుల మీదుగా తుమ్మలపెంటరోడ్డు కూడలి వద్దనున్న స్పందన కల్యాణమండపానికి చేరుకుంటుందని, భక్తులు వేలాదిగా తరలివచ్చి యాత్రను జయప్రదంచేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కావలి ఇస్కాన్ మందిరం ప్రచారకర్త చంద్రశేఖరస్వామి, డాక్టర్ మాధవరెడ్డి, నల్లూరి రవికుమార్, బొగ్గవరపు వెంకటసత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, రమేష్‌రెడ్డి, ఎం. మాలకొండారెడ్డి, గోపీకృష్ణ, బి.వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

**వీఎస్‌యు వీసీ ఆచార్య జి.ఎం సుందరవల్లి**



క్రీడల్లో ఉత్తమంగా రాణించి క్రీడాకారులు సింహపురి సత్తా చాటాలని, క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని విక్రమసింహపురి యూనివర్శిటీ (వీఎస్‌యు) వీసీ ఆచార్య జి.ఎం సుందరవల్లి చెప్పారు. ఇటీవల ఆమె కావలిలోని వీఎస్‌యు కళాశాలలో విశ్వవిద్యాలయాల అంతర్‌కళాశాలల క్రీడాపోటీలను ప్రారంభించారు. వాలీబాల్ పోటీలకు 16 జట్లు, బాల్‌బ్యాడ్మింటన్‌కు 10 జట్లు వచ్చాయి. ఆ క్రీడాకారులను వీసీకి ఈ సందర్భంగా నిర్వాహకులు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యు రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి సునీత, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ చేవూరి మణికంఠ, జవహర్‌భారతి కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఆర్ మాల్యాద్రి, ప్రసాద్‌రెడ్డి, ఆత్మకూరు ఎస్‌ఆర్‌జె డిగ్రీ కళాశాల పీడీ ఎస్.వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నంలో ఉచిత వైద్యశిబిరం



ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని గ్రామ సచివాలయంలో ఇటీవల కృష్ణపట్నం పోర్ట్ అదాని ఫౌండేషన్, అపోలో ఫౌండేషన్, కృష్ణపట్నం గ్రామ పంచాయతీ సంయుక్తంగా ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించి సుమారు 190 మందికి ఆరోగ్యపరీక్షలు చేసి అవసరమైన మందులిచ్చారు. వైద్యనిపుణులు ఆర్ గాయత్రి, సిహెచ్ సుదర్శన్‌రెడ్డి, కల్యాణ్, ఎం.సురేష్, కార్తీక్, టి.రవీంద్ర తదితరులు పాల్గొని రోగులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

# వెంగమాంబాదేవి ఆలయానికి.. రూ.20లక్షలకు పైగా రాబడి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలంలోని నర్రవాడ శ్రీ వెంగమాంబాదేవి ఆలయంలో ఈనెల 18న హుండీ లెక్కింపు జరిగింది. జులై26 నుంచి నవంబరు 18వ తేదీ వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా 20,74,130రూపాయల రాబడి వచ్చింది. ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, జిల్లా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఎం.సుధీర్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఉషశ్రీ ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

# మాదకద్రవ్యాలతో జాగ్రత్త

**- సెబ్ సీఐ బాలకృష్ణ**



ఆరోగ్యాన్ని నాశనం చేసి ప్రాణాలకు ముప్పుతెచ్చే మాదకద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సీఐ బాలకృష్ణ చెప్పారు. ఇందుకూరుపేట మండలంలోని మైపాడు వద్ద మాదకద్రవ్యాల నిరోధానికి ఇటీవల అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. ముఖ్యంగా, బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు చేసి కుటుంబాలను వృద్ధిలోకి తీసుకురావాల్సిన యువత పెడమార్గం పడుతున్నారని, మత్తుమందులు వినియోగిస్తూ జీవితాలను చెడగొట్టుకుంటున్నారని, మాదకద్రవ్యాలను కలిగివున్నా, వినియోగించినా నేరమని, కఠిన శిక్షలుంటాయని హెచ్చరించారు.

# నాగులచవితి వేడుకలు



నాగులచవితి పర్వదినం సందర్భంగా ఇటీవల జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో మహిళలు పెద్దఎత్తున నాగుల పుట్టలకు పూజలు చేశారు. అనుమసముద్రంపేటలోని బస్టాండు వద్ద ఉన్న నాగులపుట్టను పూలతో, పసుపుకుంకుమలతో అలంకరించి, పాలు పోసి 'కరుణించమ్మా నాగదేవతా' అంటూ ప్రార్థించారు. మండల కేంద్రమైన సంగంలో నాగశిలల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కోవూరు మండలం చిన్నపడుగుపాడులో నాగుల పుట్ట వద్ద పూజలు చేసి, నాగదేవతను తలచుకుంటూ పూలంగిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు దాతలు నాగుల పుట్ట వద్ద భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు, అన్న వితరణ గావించారు.

## సాగునీరు కేటాయింపులో..

# మెట్ట రైతులకు అన్యాయం

**-టీడీపీ నేత చెంచలబాబుయాదవ్**

ఇటీవల జిల్లా నీటిపారుదల సలహా బోర్డు (ఐఏబీ) తీసుకున్న నిర్ణయాల వల్ల మెట్ట రైతులకు అన్యాయం జరుగుతుందని జడ్పీ మాజీ ఛైర్మన్, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలోని రైతులందరినీ సమానప్రాతిపదికన చూడకుండా డెల్టా–నాన్ డెల్టా అంటూ విభజించి చూడడం అన్యాయమని, డెల్టాప్రాంతాల్లో వ్యవసాయ బోర్లు సమృద్ధిగా ఉన్నప్పటికీ డెల్టా ప్రాంతాలకే నీటి విడుదలలో ప్రాధాన్యత ఇవ్వడం సముచితం కాదన్నారు.



# ప్రైవేట్ పాఠశాలలకు ఊరట

**ఎమ్మెల్సీ పర్వతరెడ్డికి కరస్పాండెంట్ల అభినందన**

ప్రైవేట్ పాఠశాలలకు ఇప్పుడున్న మూడేళ్ళ గుర్తింపు ఎనిమిదేళ్ళకు మారుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీఓ జారీచేయడం పట్ల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ జీఓ వల్ల రాష్ట్రంలోని సుమారు 2వేలకుపైగా ప్రైవేట్ పాఠశాలలకు ప్రయోజనం చేకూరుతుందని, 8సంవత్సరాల రెన్యువల్ గుర్తింపు లభించడం గొప్ప పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పదేళ్ళు పూర్తిచేసుకున్న పాఠశాలలు రెన్యువల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో, తనతోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ప్రభుత్వంతో చేసిన చర్చల ఫలితంగా ఆఫ్‌లైన్ ద్వారా కూడా రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం కల్పించారని, జీఓ నం.90ని విడుదల చేయడం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆ జీఓ వచ్చేందుకు కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని ఇటీవల నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో మూడు జిల్లాల నుంచి వచ్చిన అనేకమంది ప్రైవేట్ పాఠశాలల వారు ఆత్మీయంగా కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలలకు 8 సంవత్సరాల గుర్తింపు సాధించడంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి కృషి ఎంతోవుందని వారు కొనియాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ప్రైవేటు పాఠశాలలకు ఎనిమిది సంవత్సరాల గుర్తింపు తీసుకువస్తానని ఇచ్చిన హామీ ప్రకారం ప్రైవేటు పాఠశాలకు ఆ మేరకు, రెన్యువల్ లభించేలా ప్రభుత్వాన్ని ఒప్పించి జీవో విడుదల చేయించడం ఎంతో సంతోషకరమన్నారు. రెన్యువల్‌కు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే కాక ఆఫ్ లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం పట్ల అపుస్మా రాష్ట్ర నాయకులు ఎంవి సుబ్బారెడ్డి హర్షం ప్రకటించారు.

# డా. కిషోర్స్ రత్నం విద్యార్థుల సేవాభావం

**అనాథాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ**




నెల్లూరులోని డా. కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ హైస్కూల్ విద్యార్థులు అనాథలకు తమవంతు సామాజిక సేవలందిస్తూ అందరి అభినందనలు అందుకుంటున్నారు. ప్రతిఏటా నవంబరులో నిర్వహించే 'కమ్యూనిటీ సర్వీస్ డే'ని పురస్కరించుకుని, ఈ ఏడాది కూడా నవంబరు 16న నెల్లూరు సమీపంలోని రాజుపాళెంలో ఉన్న 'విశ్వజనని' అనాథాశ్రమానికి విద్యార్థులు బియ్యం, పప్పుధాన్యాలు, సబ్బులు, గోధుమపిండి, చక్కెర, నూనె, టవళ్ళు వగైరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా. కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లకు విశ్వజనని ఆశ్రమం నిర్వాహకులు సాగర్, లక్ష్మిలు ధన్యవాదాలు తెలిపారు. విద్యాసంస్థల మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావం అలవరచుకోవడం, అనాథలకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందని, పిల్లలను ఆ విధంగా ప్రోత్సహిస్తున్న వారి తల్లితండ్రులను ఆయన అభినందించారు. విద్యాసంస్థల జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, కోఆర్డినేటర్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. బాధితులను ఆదుకోండి

రక్తదానం చేసి బాధితులను, రోగులను ఆదుకోవాలని నెల్లూరు రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. తన పుట్టినరోజు సందర్భంగా 47వ సారి ఆయన రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కరు చేసే రక్తదానం వల్ల ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చునని, అత్యవసర పరిస్థితులలో బాధితులు లేదా రోగుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. అందులోనూ ఈ చలి వాతావరణంలో విషజ్వరాల ప్రభావంతో అనేకమందికి రక్తం, ప్లేట్లెట్లు అవసరం ఉందన్నారు. రక్తదానం చేసేందుకు ఆసక్తి ఉన్నవారు రెడ్‌క్రాస్ రక్తనిధిలో తమ పేరును నమోదుచేసుకోవచ్చని చెప్పారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను రెడ్ క్రాస్ రక్తనిధి కన్వీనర్ అజయ్‌బాబు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జి.వి నరసయ్య, బీజేపీ లీగల్‌సెల్ జిల్లా కన్వీనర్ పి.భాస్కర్, న్యాయవాదులు ఓ.వెంకటరాజు, పి. రామకృష్ణ, జి.కేశవులు, మొగ్గ కన్వీనర్ ఏ.సాయిరాం, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యానికి పెద్దపీట వేయాలి

## - పూర్వ ఉప రాష్ట్రపతి మన వెంకయ్య



పత్రికలు, ప్రసార సాధనాలు సంచలనాలకు కాకుండా సత్యానికి పెద్దపీట వేసినప్పుడే నవసమాజాభివృద్ధికి బాటలు వేసినట్లవుతుందని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈనెల 19న ఆయన విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ని మాధ్యమాలు వచ్చినా సరే, పుస్తకానికి మరో ప్రత్యామ్నాయం లేదని ఆయన చెప్పారు. మనిషి మస్తిష్కానికి పదునుపెట్టే కేంద్రాలు గ్రంథాలయాలని, వాటిని సరిగా ఉపయోగించుకుంటే మంచి జీవన విధానానికి దారిచూపుతాయని ఆయన సూచించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు దాతలు సహాయపడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన తన రెండు నెలల పింఛను 5 లక్షల రూపాయలను గ్రంథాలయ అభివృద్ధికి ఇస్తున్నట్లు ప్రకటించారు.



నవంబర్ 20వ తేదీన 'లాయర్' పత్రిక కార్యాలయానికి విచ్చేసిన శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని గౌరవపూర్వకంగా స్వాగతించి, సత్కరిస్తున్న 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి (కుడి నుండి ఎడమకు), ప్రముఖ కాంట్రాక్టర్ మరియు మాజీ జడ్పిటీసి దుగ్గిరెడ్డి గురువారెడ్డి, నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాట) అధ్యక్షులు కొర్సపాటి శ్రీధర్‌రెడ్డి, ప్రగతి బయో ప్రొడక్ట్స్ అధినేత బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి.

# ఏసీల తయారీ హబ్‌గా.. శ్రీసిటీ




- ఇక.. ఏటా 10లక్షల ఏసీలు రెడీ
- 'డైకిన్' ఉత్పత్తులు ప్రారంభం

**ఏసీల తయారీకి శ్రీసిటీ నెలవుగా మారింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఏసీ తయారీ సంస్థ, జపాన్‌కు చెందిన 'డైకిన్' పరిశ్రమ శ్రీసిటీలో ఈనెల 23 గురువారం నాడు ఉత్పత్తులు ప్రారంభించడంతో దేశంలో ఇక ఏసీలకు దిగుల్లేదు. శ్రీసిటీలో అంతర్జాతీయ స్థాయిలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులు పుష్కలంగా ఉండడంతో ఇప్పటికే దేశ విదేశాలవారు శ్రీసిటీలో అనేక పరిశ్రమలను స్థాపించారు. అందులో డైకిన్ వంటి ప్రఖ్యాత పరిశ్రమలు రావడం ఒక గొప్ప విశేషం. దీంతో పరిశ్రమల హబ్‌గానే కాక, శ్రీసిటీ ఇక ఏసీల హబ్‌గా కూడా పేరొందుతోంది.**




దాదాపు వెయ్యికోట్ల పెట్టుబడితో 75.5 ఎకరాల విస్తీర్ణంలో, ఏటా 10 లక్షల ఏసీలు తయారుచేసే సామర్థ్యంతో శ్రీసిటీలో 'డైకిన్' పరిశ్రమ ఈ యూనిట్‌ను శరవేగంగా స్థాపించి ఈ నెల 23వతేదీన ప్రారంభించింది. ఇది దేశంలో ఆ సంస్థకు చెందిన మూడవ యూనిట్ కాగా, ఆగ్నేయాసియా ఖండంలోనే అతిపెద్దది. అట్టహాసంగా జరిగిన ఈ ప్రారంభోత్సవంలో జపాన్ పరిశ్రమ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శ్రీసిటీలో గత ఏడాది ఏప్రిల్‌లో పనులు ప్రారంభించి కేవలం 18 నెలల్లోనే ఈ యూనిట్‌ను సిద్ధం చేయడం విశేషం. దీని ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కల్పించ డమే కాక, 75శాతం ఉద్యోగాలు స్థానికు లకే ఇవ్వాలన్న ఆలోచనతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో డైకిన్ ఆమేరకు ఉద్యోగ నియామకాలు చేసింది. డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు డైకిన్ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో నియమించడం మరో విశేషం! శ్రీసిటీలో డైకిన్ యూనిట్ ప్రారంభమవడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.


ఏదేమైనా, దేశవ్యాప్తంగా ఏటా 75 లక్షల ఏసీలు అమ్ముడవుతుంటే, ఒక్క మన రాష్ట్రంలోనే వివిధ యూనిట్ల ద్వారా లక్షలాది ఏసీలు తయారవుతుండడంతో అన్నపూర ఆంధ్ర.. చల్లని ఏసీలకు కూడా ప్రసిద్ధి చెందుతోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీసిటీ వ్యవస్థాపకులు మరియు మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు డైకిన్ ఇండియా అధ్యక్షులు మరియు సిఇఓ మాసానోరీ టొగావా, ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కన్‌వాలీజీత్ జావా, చెన్నైలోని జపాన్ కౌన్సిల్ జనరల్ మసాయుకి టాగా, భారతదేశంలోని జపాన్ మాజీ రాయబారి సుజన్ ఆర్ చినోయ్, పెట్టుబడి విభాగం మేనేజింగ్ డైరెక్టర్ మరియు సిఇఓ మిస్ నివృతీరాయ్ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్‌లో.. ప్రశాంత పాలన అందిస్తా!

## నెల్లూరు ఎంపీ ఆదాల



తన పాతికేళ్ళ రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితం చేయడం జరిగిందని, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ప్రజలకు ప్రశాంత పాలనను అందిస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల స్పష్టం చేశారు. రూరల్‌లోని 20వ డివిజన్లో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు ఆయన ఈనెల 20న శంకుస్థాపన చేశారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు పాతపాటి పుల్లారెడ్డి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఛైర్మెన్.. డివిజన్ ఇన్‌ఛార్జి రావు శ్రీనివాసరావు, నాయకులు తాళ్లూరి సురేష్ బాబు, దువ్వూరు భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇన్నేళ్ళుగా ఎటువంటి వివాదాలు లేకుండా అనునిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజా సంక్షేమం కోసమే తాను పాటుపడుతున్నానని, నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రుపొందిస్తున్నామని తెలిపారు. 20వ డివిజన్లోని వివిధ ప్రాంతాలలో రూ. 62లక్షలతో సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్స్ నిర్మాణ పనులు చేపట్టం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా ప్రజలు నిలవాలని, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న తనకు అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ప్రాణాలకు పొగబెడుతున్న ధూమపానం

'సరదా సరదా సిగరెట్టు..అది తాగితే ప్రాణం కొడిగట్టు'.. అన్నట్లుగా తయారైంది పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా ఈ దురలవాటు మరో మహమ్మారిగా మారుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. అత్యంత సులభంగా అలవాటైపోయి, చివరికి మనిషి చిక్కి శల్యమైపోయే దాకా వదిలిపెట్టని పొగభూతం ఇది. అయితే, అది లేకుంటే ఇక బతకలేం అన్నట్లుగా ఉంటున్నవారు కోకొల్లలు. ఒక్క మన దేశంలోనే కాదు, అనేక దేశాల్లో ఈ పొగతాగడం అన్నది ఒక పెద్ద ఫ్యాషన్‌గా మారిపోయింది. 'పొగ మానండోయ్ బాబూ.. రోగాల బారిన పడకండోయ్'.. అని ప్రభుత్వాలు, వైద్యనిపుణులు ఎంతగా మొత్తుకుంటున్నా తాగేవారు మానలేకపోతున్నారు. ధూమపానం వల్ల గుండె జబ్బులు, తదితర వ్యాధులతో మన దేశంలో ప్రతి ఏటా 9 లక్షల మంది దాకా మృత్యువాత పడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న సంవత్సరాల్లో ఏడాదికి కనీసం కోటిమంది దాకా మృత్యువాతపడవచ్చని వైద్యనిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల తాజాగా వచ్చిన ఓ అధ్యయనంలో ధూమపానం కారణంగా ప్రపంచంలో క్యాన్సర్ బారినపడి 7 దేశాల్లో 13 లక్షల మందికి పైగానే ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడైంది. 'ద లాన్సెట్ ఇ-క్లినికల్ మెడిసిన్' అనే ప్రఖ్యాత వైద్యపత్రిక పొగతో కలిగే ప్రమాదాల గురించి ఒక అధ్యయనాన్ని ప్రచురించింది. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్, క్వీన్స్ మేరీ యూనివర్శిటీ-లండన్', కింగ్స్ కాలేజీ శాస్త్రవేత్తలు ఆ పరిశోధనలో పాల్గొన్నారు. మరణాలకు గురౌతున్న దేశాల్లో భారత్‌తో పాటు అమెరికా, చైనా, రష్యా, బ్రిటన్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా ఉన్నాయని పేర్కొంది.

ధూమపానం వల్ల.. ఆరోగ్యం గుల్ల. సిగరెట్టు కాల్చితే.. అదే మనల్ని కాల్చేస్తుంది. దాన్ని పీలిస్తే అది మనల్ని పీల్చి పిప్పిచేస్తుంది. ఆ పొగను పక్కనున్నవారు పీల్చినా వారి ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తుంది. ఇవన్నీ తెలిసిన విషయాలే అయినా, పొగరాయుళ్ళు మాత్రం దాన్ని వదిలిపెట్టకుండా ఉత్తి పుణ్యానికి రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. ఆ పొగ నోటిని, స్వరపేటికను, నాలుక, గొంతు, ఆహారనాళం వగైరాలన్నిటినీ లోలోపలే దెబ్బతీస్తుందని, అది

లాయర్
నవంబర్ 24, 2023

చివరికి క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుందని, క్యాన్సర్ వచ్చాక మరణించేదాకా నరకయాతన పడేకంటే, ధూమపానం వంటి వాటి జోలికిపోకుండా ఉండడం ఎంత మేలో అర్థం చేసుకోవాలని వైద్య నిపుణులు ఘోషిస్తున్నారు. ధూమపానం వల్ల కలిగే దుష్పరిణామాల వల్ల ఆయా కుటుంబాల వారికి వస్తున్న రోగాలకయ్యే ఖర్చును సరాసరి లెక్కేస్తే సుమారు 40వేల కోట్ల దాకా ఉంటుందని, అది కాకుండా.. పొగాకు వ్యాధుల చికిత్స నిమిత్తం మనదేశ ఆర్థికవ్యవస్థకు మరో లక్షకోట్ల దాకా అదనపు భారం పడుతోందని కేంద్రప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇది మన ప్రజారోగ్య బడ్జెట్ కన్నా, పొగాకు ఉత్పత్తులపై వస్తున్న పన్నులకన్నా, వాటిని వాడేవారికి వస్తున్న జబ్బులను నయంచేసేందుకు అందిస్తున్న చికిత్సల వ్యయం ఎన్నో రెట్లు అధికంగా ఉందట. పాశ్చాత్య విషసంస్కృతి నరనరాల్లో జీర్ణించుకునిపోయాక ప్రజల ఆహారపుటలవాట్లు, జీవన విధానం అన్నీ పూర్తిగా మారిపోయాయి. దురలవాట్లే ఫ్యాషన్ కల్చర్‌గా తయారయ్యాయి. విద్యార్థి దశ నుంచే పక్కదారిపట్టిపోయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. నగరాల్లో పబ్‌కల్చర్, హుక్కా సెంటర్లు, రకరకాల క్లబ్‌లు వగైరాలన్నీ పుట్టుకొచ్చాక అంతా విచ్చలవిడైపోయింది. పురుషులతో పాటు అనేకమంది మహిళలు కూడా ఈ దురలవాటుకు లోనవుతుండడం, అందువల్ల గర్భాశయ క్యాన్సర్ వంటి ప్రమాదాలకు గురవుతుండడం బాధాకరం. నికొటిన్‌తో పాటు, అనేకరకాల రసాయనాలు ఈ పొగలో మిళితమై ఉంటాయి. అందులో క్యాన్సర్ కారకాలు కూడా కలిసివుంటాయి. గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, మూత్రపిండ క్యాన్సర్, క్షయ, వదలని దగ్గు, బ్రాంకైటిస్ వంటివన్నీ ధూమపానంతో వచ్చే జబ్బులు. దాదాపుగా ఇవన్నీ ప్రాణాంతకమైనవే. వీటితో పాటు మధుమేహం (చక్కెరవ్యాధి), కీళ్లవాతం, అంధత్వంతో పాటు నపుంసకత్వం వంటి ఎన్నోరకాల సమస్యలు కూడా వస్తుంటాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. దేశంలో కోట్లాదిమంది ఈ దురలవాటుకు బానిసలుగా మారారు, ఇంకా మారుతూనే ఉన్నారు. దీని నివారణకు ప్రభుత్వాలు మరింత గట్టిచర్యలు తీసుకోవాలి. ఇకనైనా, సరదాకని నరక ద్వారాలు తెరవకుండా, మన చేతుల్తోనే మన ప్రాణాలకు పొగపెట్టుకోకుండా జాగ్రత్తగా ఉండడం శ్రేయోదాయకం. ముఖ్యంగా ఎంతో భవిష్యత్తు ఉండే బాలలు, విద్యార్థులు, యువత ఇలాంటి పనికిమాలిన దురలవాట్లను అంటించుకోకుండా వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

# 'క్రికెట్'... వ్యాపార విన్యాసంగా మారిన క్రీడా వినోదం!

'క్రికెట్'... స్కూలుకి వెళ్లే పిల్లల నుండి కాటికి కాలు చాపిన ముదుసలి వరకు అత్యంత ఆసక్తిగా చూసే ఆట ఇది. విశ్వ వ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన క్రీడా వినోదం. ప్రపంచం మొత్తంలో ప్రధానంగా 12 దేశాలలో అత్యంత ప్రాముఖ్యతని సంతరించుకున్న గేమ్ క్రికెట్. ఆటగాళ్ళు, కోచ్‌లు, విశ్లేషకులు, ఫిట్నెస్ ట్రైనర్లు అంతాకలిపి ఒక్కొక్క టీమ్‌లో మహా అంటే అటు ఇటుగా మొత్తం ఓ పాతికమంది ఉంటారు. ఈ పాతికమందిలో ఒక్కొక్క జట్టు నుండి కేవలం 11 మంది మాత్రమే ప్రత్యక్షంగా ఆటలో పాల్గొంటారు. అంటే మ్యాచ్ జరిగినప్పుడల్లా రెండు జట్లలో కలిపి 22 మంది మాత్రమే మనకి మైదానంలో దర్శనమిస్తారు. నేరుగా అయితేనేమి, టీవీల ద్వారానైతేనేమి ఈ మ్యాచ్‌లని కొన్ని కోట్లమంది తిలకిస్తారు. క్రీడాస్ఫూర్తితో మొదలైన క్రికెట్ ఇప్పుడు వ్యాపార విన్యాసంగా మారిందంటే అతిశయోక్తి కాదేమో!

ఒకప్పుడు కేవలం టెస్టు మ్యాచ్‌లకే పరిమితమైన ఈ అట, ఇప్పుడు అనేక రకాలుగా అవతరించి క్రీడాభిమానులని ఆకట్టుకుంటూ కొన్ని వేలకోట్ల వ్యాపార లావాదేవీలకు కీలకమవుతోందన్నది ఎవ్వరూ కాదనలేని నిజం. అటమీద ఇష్టంతోనో, మోజుతోనో ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లమంది క్రికెట్టుకి బానిసలవుతున్నారు. ఆ ఆటపై తమకున్న మక్కువతో కీలక మ్యాచ్‌లు ఉన్న సమయంలో తమ సొంత వ్యాపారాలని, ఉద్యోగాలని పక్కనపెట్టి టీవీలకి అంకితమైపోతున్నారు. అయితే, క్రికెట్ అభిమానుల బలహీతని సొమ్ము చేసుకునే క్రమంలో ప్రభుత్వ పెద్దలు, కార్పొరేట్ సంస్థలు, బెట్టింగ్ బుకీలు తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించి పబ్బం గడుపుకుంటున్నారు. తమ స్వార్థం కోసం దేశ పరువుని, ప్రతిష్టని కూడా తాకట్టుపెట్టి మరీ క్రికెట్టుని వ్యాపార విన్యాసంగా మార్చేస్తున్నారు. ఈ ఏడాది జరిగిన ప్రపంచ కప్ ఆట కూడా కొంతమంది స్వార్థానికి బలై భారత్ ఓటమిపాలైందన్న విమర్శలు క్రికెట్ అభిమానుల నుండి వెల్లువెత్తుతున్నాయి.

మొన్న నవంబర్ 19వ తేదీ ఆదివారం మధ్యాహ్నం నుండి ఇళ్ళలో టీవీల ముందు, అనేకచోట్ల మైదానాలలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌ల ముందు, షాపింగ్ మాళ్ళలో, పబ్బులలో, బార్లలో కోట్లమంది ప్రపంచకప్ ఫైనల్స్‌ని వీక్షించారు. ఈ మ్యాచ్‌పై భారతీయులు చాలా ఆశలు పెట్టుకున్నారు. ఫైనల్స్‌లో 'కంగారులను' భారత్ ఆటగాళ్లు కంగారుపెట్టి ఖంగుతినిపిస్తారనుకున్నారు. తొలినుండి అనూహ్య విజయాలతో ఫైనల్స్‌కి చేరుకుంది. కానీ, చివరి అంకంలో సీన్ మారింది. భారత జట్టు పరాజయం పొందింది. భారత జట్టు 50 ఓవర్లలో కేవలం 240 రన్‌లు కొట్టడం క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేకపోయారు. తరువాత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 43 ఓవర్లలో కేవలం 4 వికెట్ల నష్టంతో తమ లక్ష్యాన్ని చేరుకోవడం భారతీయ క్రికెట్ అభిమానులను విస్మయపరచిన అంశం.




గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నరేంద్రమోడీ స్టేడియం కొత్తగా నిర్మించింది కావడం, గతంలో ఎప్పుడూ అక్కడ ఈస్థాయి మ్యాచ్ జరిగి ఉండకపోవడంతో ఈ స్టేడియం వరల్డ్ కప్ ఫైనల్స్‌కి అనువైంది కాదన్నది క్రికెట్ అభిమానుల అభిప్రాయం. ముంబై, కోల్‌కత్తా, చెన్నై తరహాలో క్రీడాకారులని ప్రోత్సహించి, ఉత్సాహపరచే సంప్రదాయం కూడా గుజరాతీయులకి కొత్త కావడం ఒక మైనస్ పాయింట్. వ్యాపార దృక్పథంతో ఆదాయాన్ని దృష్టిలోపెట్టుకుని ఆ స్టేడియాన్ని ఫైనల్స్‌కి ఎంపిక చేసినందునే భారత్ ఓడిపోయిందని క్రీడాభిమానులు బల్లగుద్ది చెప్తున్నారు. గుజరాతీయులైన కేంద్రప్రభుత్వ పెద్దలు, స్వార్థపూరితంగా తీసుకున్న నిర్ణయమే భారత్ కొంపముంచిందని సర్వత్రా వినిపిస్తున్న మాట. ఈ అంతిమ పోరాటం ముంబాయి, కలకత్తా లేదా చెన్నైలలో ఎక్కడ జరిగివున్నా విజయం భారత్‌నే వరించి ఉండేదన్నది కూడా వారి అభిప్రాయం. నిజంగా అదే కారణం అయితే, ఇక్కడ దేశ ప్రతిష్టకంటే వ్యాపారానికే ప్రాధాన్యత కల్పించి ఉంటే అది క్షమించరాని నేరమే.



ఈ క్రీడల నిర్వహణ ద్వారా క్రికెట్ అసోసియేషన్ వేల కోట్లు గడిస్తుంటే, టీవీలలో వచ్చే ప్రకటనల ద్వారా ఆటగాళ్ళు వందల కోట్లు వెనకేసుకుంటున్నారు. ఈ ఆట ద్వారా తమకు లభిస్తున్న గుర్తింపును సాధ్యమైనంత ఎక్కువ స్థాయిలో క్రికెటర్‌లు సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు బెట్టింగుల రూపంలో కొన్ని వేల కోట్లు చేతులు మారుతున్నాయి. వందల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. క్రికెట్టు ఇప్పటికే క్రీడాస్ఫూర్తిని కోల్పోయి వ్యాపార వ్యవహారంగా మారిపోయిందనడానికి ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి. క్రీడాభిమానులు ఇకనైనా మేల్కోవాలి. గతంలో ఈ క్రికెట్‌ని అడ్డంపెట్టుకుని 'మ్యాచ్ ఫిక్సింగ్' పేరుతో కొంతమంది ఆటగాళ్ళు దేశానికి చేసిన ద్రోహాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలి.

తన రక్తాన్ని చెమటగా మార్చి ఆహార ధాన్యాలని పండిస్తున్న రైతులను, తమ మేధస్సుతో చంద్రమండలంపైన పాగావేసిన శాస్త్రవేత్తలని, తమ ప్రాణాలని పణంగాపెట్టి దేశ రక్షణ కోసం రాత్రనక పగలనకా ఎముకలు కొరికే చలిలో పహారా కాస్తూ, తమ భార్యాబిడ్డలకి సైతం దూరంగా బ్రతుకుతున్న సైనికులని మనం విస్మరిస్తున్నాం. ధనమే ధ్యేయంగా మన బలహీనతని సొమ్ము చేసుకుంటున్న ఈ స్వార్థపరుల కోసం ప్రార్థనలు చేస్తున్నాం, విలువైన మన సమయాన్ని వృధాచేసుకుంటున్నాం. ఇకనైనా మారుదాం... బాధ్యతగల పౌరులుగా, విచక్షణ కలిగిన భారతీయులుగా వ్యవహరిద్దాం!

- రాజశ్రీ

# గుంతలమయం..జొన్నవాడ రోడ్డు

జొన్నవాడ రోడ్డు గుంతలమయంగా తయారైపోయింది. అందులోనూ ఈ వానల్లో ఆ గుంతల్లో నీళ్ళు నిండిపోయి ఉండడంతో, వాహనాల రాకపోకలకు బాగా ఇబ్బందిగా ఉంది. తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వచ్చే దారి మార్గమధ్యంలో పెనుబల్లి ప్రాంతంలోనూ, ఇంకా అక్కడక్కడా భారీ గోతులు పడివున్నాయి. జిల్లాలోని ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం ఒకటన్నది అందరికీ తెలిసిందే. అందులోనూ ఈ కార్తీకమాసంలో ఆలయానికి భక్తజనం వేలాదిగా వస్తుంటారు. జిల్లా నుంచే కాక, రాష్ట్రవ్యాప్తంగా అమ్మవారి భక్తులు ఇక్కడికి వాహనాల్లో తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్లు సక్రమంగా లేకపోవడం వల్ల నిత్యం భక్తులు, ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు శ్రద్ధ తీసుకుని, జొన్నవాడ పుణ్యక్షేత్రానికి పలు ప్రాంతాల నుంచి, చుట్టుపక్కలున్న పలు గ్రామాల నుంచి ఉన్న రోడ్లు కూడా ఏ దుస్థితిలో ఉన్నాయో ఒకసారి పరిశీలించి, వెంటనే గుంతలు పూడ్పించి, మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి.

– కే.ఎస్.శర్మ, జొన్నవాడ.




# కళాకారుల జీవితాలని కళ్ళకి కట్టారు!

మన 'లాయర్'లో "సత్యపీఠం" పేరుతో వారం వారం వస్తున్న కథనాలు చాలా బాగుంటున్నాయి. నిజాలు చెప్పాలంటే చాలా ధైర్యం కావాలి... అలాంటిది "అన్నీ నిజాలే మాట్లాడుకుందాం" అంటూ గత కొన్ని వారాలుగా కఠోర వాస్తవాలను నిర్భయంగా, నిర్మొహమాటంగా 'లాయర్' పాఠకులకు రాజశ్రీ తెలియచేస్తున్నారు. గత వారం పత్రికలో కళాకారుల జీవితాల గురించి బాగా విశ్లేషించారు. లక్షలు, కోట్లు గడిస్తున్న టీవీ – సినిమా నటులకి ఉన్న ఆదరణ, గుర్తింపు స్టేజీ నటులకు లేదు. ఒక కళాకారుడిగా ఆ రంగం సాధకబాధలు తెలిసిన వ్యక్తిగా నాటి మహానటులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో కళారంగానికి మంచి ప్రాముఖ్యత ఉండేది. అంతే ప్రాధాన్యతని రామారావు తరువాత పాలించిన ప్రభుత్వాలు కూడా కళారంగానికి కల్పించాయి. ఒక్క జగన్ ప్రభుత్వం మాత్రం కళారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. కళలని ఆస్వాదించాలన్నా, అరాధించాలన్న, ఆదరించాలన్నా కళాత్మక హృదయం ఉండాలి. అలా కాకుండా కళారంగాన్ని, కళాకారులని అన్ని విధాలుగా నిర్లక్ష్యంచేసి అవహేళన చేయడం బాధాకరం. ప్రభుత్వంలో భాగంగా పనిచేస్తున్న సాంస్కృతిక శాఖ కూడా మొద్దునిద్ర పోవడం విచారకరం.

– పి.శైలజ, నెల్లూరు.



# సోమశిలకు నీళ్ళోచ్చాయ్

- 20న ఇచ్చారు... 21న ఆపారు
- వర్షాలతో నీటి విడుదల నిలిపివేత

పెన్నా డెల్టా ప్రాంత రైతాంగానికి సోమశిల జలాశయం నుంచి 1800 క్యూసెక్కుల నీటిని సాగునీటికి, తాగునీటి అవసరాల కోసం ఈనెల 20న అధికారులు విడుదల చేశారు. ఈనెల 20న పంటలకు నీరు విడుదల చేయాలని జిల్లా సాగునీటి సలహాబోర్డు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ మేరకు సోమశిల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దశరథరామిరెడ్డి, నెల్లూరు సెంట్రల్ ఇఇ నాగరాజు, డెప్యూటి ఇఇ అనిల్ కుమార్‌రెడ్డి, సోమశిల డ్యామ్ ఇఇ రవీంద్రప్రసాద్, జేఇఇ రామ్మోహన్‌రెడ్డి, నిఖిల్ తదితర అధికారులు జలపూజలు చేసి సోమశిల డ్యామ్ 12వ క్రస్ట్‌గేట్ ద్వారా నీరు విడుదల చేశారు. అయితే, వర్షాల వల్ల 21వ తేదీ కల్లా 29.300 టిఎంసీల నీళ్ళు సోమశిల డ్యామ్‌కు చేరడం, నెల్లూరు, బుచ్చి, సంగం ప్రాంతాల్లో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నెల్లూరు డెల్టాకు సాగునీటి విడుదల నిలిపివేశారు.

# ఆలయాలకు కార్తీక శోభ

- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం
- దీపాల వెలుగులో దేవాలయాలు



***దైవారాధనకు పరమ పవిత్రమైన కార్తీకమాసం తొలి సోమవారం (ఈనెల 20) రోజున జిల్లాలోని అనేక ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామి వార్లకు ప్రత్యేకపూజలు, విశేష సేవలు చేశారు. దీంతో ఆలయాలు కార్తీకశోభతో కళకళలాడాయి. ప్రత్యేకించి శివాలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. జోరువానలోనూ భక్తులు వచ్చి దీపాలు వెలిగించి పూజలు చేసుకున్నారు. శివ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలతో, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, శివ సహస్రనామ పారాయణాలతో, ప్రాకారోత్సవాలు, పల్లకిసేవలు వగైరాలతో దేవాలయాలు కోలాహలంగా కనిపించాయి.***

జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవాలయంలో సోమవారం రాత్రి లక్షదీపోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంతా కార్తీక దీపాల వెలుగులో దేదీప్యమానమైంది. అదేవిధంగా నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో విశేష పుష్పాలంకరణలు చేసి, వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలోని మీనాక్షీదేవి సమేత శ్రీ సుందరేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. వేదాయపాళెంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సహస్రదీపారాధన కన్నుల పండువగా జరిగింది. నవాబుపేటలోని భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శివాలయం, మూలాపేట శంకరమఠంలో ఉన్న కామాక్షీదేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి మందిరం, దర్గామిట్ట సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం ప్రాంగణంలోని ఉమాదేవి సమేత శ్రీ నాగేశ్వరస్వామి దేవాలయం, ములుముడి బస్టాండ్ సమీపంలోని భ్రమరాంబాదేవి సమేత శ్రీహరహరనాథ ఆలయం, వేదాయపాళెంలోని కామాక్షీదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయాలకు మహిళా భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. నెల్లూరు చెరువు ఒడ్డున ఉన్న గణేష్ ఘాట్‌లో సింహపురి కార్తీకదీపోత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక దీపాలు వెలిగించి, దొన్నెల్లో పెట్టి చెరువు నీటిలో వదిలారు. అనంతరం స్వర్ణ లింగేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు.

# అధోగతిలో.. గ్రంథాలయాలు

- ➢ నిధులు లేవు... బకాయిలేమో రావు...
- ➢ శిధిలావస్తకు చేరుకుంటున్న లైబ్రరీలు
- ➢ పట్టించుకోని పాలకులు.. నిర్లిప్తంగా అధికారులు



***గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలు. విజ్ఞాన బాండాగారాలు. పుస్తకాలు చదువుకోవడం ద్వారా ప్రజల్లో విజ్ఞాన సముపార్జనకు బాటలు వేసే గ్రంథాలయోద్యమం ఎందరో మహనీయుల కృషి ఫలితంగా ఆవిర్భవించింది. అయితే, అటు పాలకులు..ఇటు అధికారుల అనాసక్తి వల్ల జిల్లాలో గ్రంథాలయాల పరిస్థితి దయనీయంగా మారింది. గ్రంథాలయాలకు ఇవ్వాల్సిన సెస్సు బకాయిలు ఇవ్వకపోతుండడంతో వీటి అభివృద్ధి అడుగంటిపోయింది. కోట్లల్లో ఆ బకాయిలు పేరుకుపోతున్నాయి. మరో వైపు అనేక గ్రంథాలయాలు శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. అయినా అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండదు. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ నుంచే దాదాపు 32 కోట్ల రూపాయల దాకా సెస్సు బకాయిలు రావాల్సివుందంటే అతిశయోక్తి కాదు. ఆ బకాయిలు ఇంకా ఎన్నేళ్ళకు వస్తాయో, ఈ గ్రంథాలయాలు ఎప్పటికి బాగుపడతాయో ఆ దేవుడికే తెలియాలి.***

జిల్లాలో గ్రంథాలయాల వారోత్సవాలు మొన్ననే జరిగాయి. ఉత్సవాలు ఘనంగానే ఉన్నాయి కానీ, గ్రంథపాలకుల్లో మాత్రం ఉత్సాహం లేదు. కారణం ఒకటే..నిధులు లేవు. రావాల్సిన బకాయిలు రావు. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా అవస్తగానే ఉంటోంది. జిల్లా గ్రంథాలయాలకు ఇది ప్రతిఏటా ఎడతెగని సమస్యగానే ఉంటోంది. గత ఏడాది కూడా ఇదే దుస్థితి.

గ్రంథాలయాల అభివృద్ధికి సెస్సులతో వచ్చే నిధులే కీలకం. గ్రామపంచాయతీలు, మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థల నుంచి కొంతమొత్తాన్ని గ్రంథాలయాలకు సెస్సుల రూపంలో చెల్లించాలనేది ప్రభుత్వ నిబంధన. 1961 ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ లైబ్రరీస్ యాక్ట్ ప్రకారం స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలుచేస్తున్న పన్నుల్లో రూపాయికి 8 పైసల వంతున గ్రంథాలయాలకు సెస్సు రూపేణా చెల్లించాలి. దాంతో గ్రంథాలయాల అభివృద్ధికి బాటలు వేయాలి. ఎప్పుడు ప్రజలనుంచి పన్నులు వసూలు చేస్తారో, అదే రోజున గ్రంథాలయాలకు కూడా సెస్సులు పంపాలి. కానీ, జిల్లాలోని స్థానిక సంస్థల వారు ప్రజల నుంచి ఎప్పటికప్పుడు ముక్కు పిండి పన్నులు వసూలు చేసుకుంటున్నారు కానీ, గ్రంథాలయాలకు ఇవ్వాల్సిన సెస్సు మాత్రం చెల్లించకపోవడం విడ్డూరం. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా, చివరికి పలు గ్రంథాలయాలు శిథిలమై నెత్తిన కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని లైబ్రరీల్లో కనీస వసతులు లేవు. కంప్యూటరీకరణ అసలే లేదు. పుస్తకాలు భద్రపరిచేందుకు సరైన బీరువాలు కూడా లేక చెదలు పట్టిపోతున్నాయి. ఎంతకాలం ఇలా?.. ఇకనైనా, ఏనెలకానెల సెస్సు బకాయిలు తప్పనిసరిగా చెల్లించేవిధంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని గ్రంథాలయాల బాగుకు చేయూతనివ్వాలి.

ఈ కంప్యూటర్ కాలంలో గ్రంథాలయాలకు వచ్చే పాఠకులే అంతంత మాత్రం. ఇక, వారికి కూడా కనీస సదుపాయాలు కల్పించలేకపోతే... గ్రంథాలయాలు వెలవెలపోక తప్పదు.

## జిల్లా గ్రంథాలయానికే దిక్కు లేదు

జిల్లాలో 61 శాఖా గ్రంథాలయాలున్నాయి. గ్రంథాలయాల నిర్వహణకు, జీతభత్యాలకు సగం వ్యయాన్ని ప్రభుత్వం భరించినా, మిగిలిన సగాన్ని సెస్సు ద్వారా వచ్చే నిధులతోనే గ్రంథాలయ సంస్థ నడుస్తుంది. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నా, మరమ్మతులకు గురైన గ్రంథాలయాల భవనాలను బాగుచేసుకోవాలన్నా, కొత్త భవనాలు నిర్మించుకోవాలన్నా..దేనికైనా సరే నిధులే ముఖ్యం. కానీ ఇచ్చేవారెవరు? గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో గ్రంథాలయాలకు అక్కడి ఉన్నతాధికారులు ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఈ దుర్గతి. సెస్సు బకాయిలు సరిగా చెల్లించని జాబితాలో నెల్లూరుజిల్లా అగ్రస్థానంలో ఉండడం ఘోరం. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలని, పాఠకులకు అన్ని సౌలభ్యాలు కలుగజేయాలని 2019లో నెల్లూరు నగరంలో శంకుస్థాపనైతే ఘనంగానే చేశారు కానీ, ఆ తర్వాత పనులే ప్రారంభం కాలేదు. భవన నిర్మాణానికి 2 కోట్ల రూపాయలవుతుందని అంచనా. దాన్ని ఇంకెన్ని ఏళ్ళకు నిర్మిస్తారో తెలియదు. జిల్లాకేంద్రంలోని భవనమే నిధులు లేక నిలచిపోయిందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ప్రత్యేకించి చెప్పేదేముందీ?..ఇప్పటికే జిల్లాలోని పలు గ్రంథాలయాలు శిథిలావస్తకు చేరుకున్నాయి. అనుమసముద్రంపేట, ఇందుకూరుపేట, మనుబోలు, చెన్నారాయునిపాళెం, అల్లూరు, దగదర్తి, సైదాపురం, రాపూరు, కలువాయి, మర్రిపాడు ప్రాంతాల్లోని గ్రంథాలయాలు రేపోమాపో కూలిపోయేట్లున్నాయి. వానకు ఉరుస్తున్నాయి. పుస్తకాలు తడుస్తున్నాయి పైకప్పుల పెచ్చులు రాలిపోతున్నాయి. ఈ సరస్వతీ విలాపాన్ని ఎవరు పట్టించుకుంటారు?..

## కోట్లల్లోకి చేరిన.. సెస్సు బకాయిలు:

*జిల్లాలో గత మార్చి నెల నాటికి.. ఒక్క నెల్లూరు కార్పొరేషన్ నుంచే గ్రంథాలయాల సెస్సు బకాయిలు **32** కోట్ల **69** లక్షల రూపాయలకు పైగానే చేరినా, ఈ బకాయిలు పేరుకుపోతూ అంతకంతకూ పెరుగుతున్నా, ఎప్పటికప్పుడు పన్నులు వసూలుచేశాక ఇవ్వాల్సిన సెస్సు బకాయిలు మాత్రం దాదాపు అయిదేళ్ళు గడిచిపోతున్నా పట్టించుకునే నాథులు లేరు. అదేవిధంగా ఉభయనెల్లూరు జిల్లా పరిధిలోని గూడూరు మునిసిపాలిటీ నుంచి రూ. **97** లక్షలు, వెంకటగిరి నుంచి రూ. **45** లక్షలు, నాయుడుపేట నుంచి రూ. **21** లక్షలు బకాయిలు రావాల్సివుంది. సూళ్ళూరుపేట మునిసిపాలిటీ ఎంతో నయం సెస్సు బకాయిలు పెండింగ్‌లో లేకుండా చెల్లిస్తోంది. కావలి మునిసిపాలిటీ నుంచి **44** లక్షల రూపాయలు, ఆత్మకూరు నుంచి రూ.**63** లక్షలు, బుచ్చి నగర పంచాయతీ నుంచి రూ. **12** లక్షలు, అల్లూరు నగర పంచాయతీ నుంచి రూ. **73** వేలు, ఇవి కాకుండా జిల్లాలోని మొత్తం గ్రామపంచాయతీల నుంచి సుమారు **2** కోట్లకు పైగానే బకాయిలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, కార్పొరేషన్ ఉన్నతాధికారులైనా వెంటనే ఈ దుస్థితి గమనించి గ్రంథాలయాలకు బకాయిలు చెల్లించే ఏర్పాట్లు చేసి, తద్వారా వాటి అభివృద్ధికి అండగా నిలవాల్సి ఉంది.*

# నెల్లూరు కబుర్లు

## పారదర్శకంగా విధులు నిర్వహించాలి

**అధికారులతో రవాణా ఉప కమిషనర్ చందర్**



నెల్లూరులోని గొలగమూడి రోడ్డులో ఉన్న వాహన సామర్థ్య ధృవీకరణపత్ర కేంద్రాన్ని ఇటీవల ఉప రవాణా కమిషనర్ చందర్ పరిశీలించారు. వాహన ఫిట్‌నెస్‌కు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించి, వాహన ఫిట్‌నెస్ కొత్త పోర్టల్ ఎన్ఐసిలో వాహన సామర్థ్య ధృవీకరణ ప్రక్రియను కొనసాగించే విధానాన్ని ఎలా అమలుచేయాలో అధికారులకు వివరించారు. అధికారులు పారదర్శకంగా పనిచేయాలని, విధి నిర్వహణలో అనధికార వ్యక్తుల ప్రమేయం ఏమాత్రం ఉండకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బాబుకు బెయిల్.. ప్రజలకి సంతోషం

**- మాజీమంత్రి సోమిరెడ్డి**



చంద్రబాబుకు బెయిల్ రావడంతో జిల్లాలోని తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు పుంజుకున్నాయి. తీర్పు వచ్చాక నెల్లూరులో మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు హైకోర్టు నుంచి రెగ్యులర్ బెయిల్ మంజూరుకావడంతో జిల్లా, రాష్ట్రంలోనే కాదు, ప్రపంచంలోని తెలుగువారంతా సంతోషపడుతున్నారన్నారు. కుట్రలు కుతంత్రాలు చేస్తూ, రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్న వైకాపాకు ఆ తీర్పు చెంపపెట్టులాంటిదని అన్నారు. న్యాయం గెలిచి తీరుతుందని ఆయన అంటూ, ఈనెల 29వ తేది తర్వాత చంద్రబాబు తిరిగి ప్రజల్లోకి వస్తారని ఆయన తెలిపారు.



## బాలల హక్కుల దినోత్సవం

అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఇటీవల బాలల హక్కుల పట్ల అవగాహన కలిగించారు. నేస్తం-చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్‌లకు సంబంధించి అవగాహన పెంపొందించే గోడ పత్రికలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాలికల్లో పోషక లోపం, మరియు బాలికల విద్య వంటి అంశాలపై భవిష్యత్తులో జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారులతో కలిసి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు యూనివర్శిటీలోని ఎన్ఎస్ఎస్ సోషల్‌వర్క్ విభాగం ద్వారా కార్యాచరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. విఎస్‌యు రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ పాల్గొన్నారు.

## అలరించిన కవి సమ్మేళనం

**• చిన్ని నారాయణరావుకు అభినందన**



56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఇటీవల నెల్లూరులోని రేబాలవారి వీధిలోని రేబాల పట్టాభి రామిరెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం జరిగింది. దాదాపు ఇరవైమంది కవులు, కవయిత్రులు పాల్గొని కవి సమ్మేళనం విజయవంతం చేశారు. నెల్లూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, కార్యదర్శి కె.కుమార్‌రాజా పాల్గొని ప్రసంగించారు. కవి సమ్మేళనాన్ని ప్రముఖ కవి, సమీక్షకులు చిన్ని నారాయణరావు నిర్వహించారు. తొలుత కవుల పరిచయం నుంచి కవితల సమీక్ష వరకూ నిర్వహించిన చిన్ని నారాయణరావును గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కవిత్వ నిర్వహణలో తనదైన ప్రత్యేకశైలిని చూపిన నారాయణరావును కార్యదర్శి కె.కుమార్‌రాజా, కవులందరూ అభినందించారు.

## ఘనంగా ఆర్ఎస్ఆర్ పుట్టినరోజు వేడుకలు

**శుభాకాంక్షలు చెప్పిన ఎంపీ ఆదాల**



నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ ఛైర్మెన్, 20వ డివిజన్ వైకాపా ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) పుట్టినరోజు వేడుకలు ఈనెల 17న వేడుకగా జరిగాయి. ఆర్ఎస్ఆర్ ఆత్మీయులు, మిత్రులు, సహచరులు పాల్గొని ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ వైకాపా ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో, ఎంపీ ఆదాల, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి ఆర్ఎస్ఆర్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఆదాలను ఆర్ఎస్ఆర్ సన్మానించారు. ఆ తర్వాత వాత్సల్య అనాథ శరణాలయంలో కేక్ కట్ చేసి పిల్లలకి స్నాక్స్ పంచి, పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నెల్లూరు మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, క్లస్టర్-2 అధ్యక్షుడు పాతపాటి పుల్లారెడ్డి, 20వ డివిజన్ మరో ఇన్‌చార్జి తాళ్లూరి సురేష్, నాయకులు దువ్వూరు భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పి.నాగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్ యాదవ్, రసూల్, గొడుసు సరళమ్మ, కడివేటి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## కాత్యాయనీ వ్రతం



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 21న ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి, వేదపారాయణదారులు అవ్వారి వెంకటరామకృష్ణశర్మలు కాత్యాయని వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ రత్నం జయరామ్, ఇఓ అరవభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, సభ్యులు దొరబాబు తదితరులు పర్యవేక్షించారు.

## 'తంగిరాల మహాభారతం' 82వ భాగం




రెండవసారి కూడా మాయాజూదంలో ఓడిపోయిన పాండవులు, కురువృద్ధుల దగ్గర సెలవు తీసుకొని కుమారులతో, మిత్ర, బంధువులతో అరణ్యవాసానికి బయలుదేరుతారు. విదురుని కోరిక మీద కుంతీదేవిని హస్తినాపురంలోనే ఉంచేస్తారు. కుంతీదేవి కుమారుల కష్టాలు చూసి ఎంతో దుఃఖించి, దీనికి అంతటికీ తానే కారణమని పాండవుల దోషమేమీ లేదని విలపిస్తుంది. పాండవులు కుంతీదేవి దగ్గర సెలవు తీసుకొని బయలుదేరుతారు. ఆ సమయంలో ధృతరాష్ట్రుని అంతఃపురంలో ఎన్నో దుశ్శకునాలు గోచరిస్తాయి. ధృతరాష్ట్రుడు భయపడిపోయి విదురుణ్ణి పిలిచి పాండవులు ఏ విధంగా పయనమయ్యారో చెప్పమని కోరుతాడు. పాండవులు ఎంతో ఆగ్రహావేశాలతో ప్రయాణమవుతున్నారని వివరించి చెప్తాడు. దుఃఖిస్తున్న ధృతరాష్ట్రుడిని, అంతా తప్పు నీదేనని చెప్పి ఇప్పుడైనా పాండవులను తిరిగి రప్పించమని అడిగితే ధృతరాష్ట్రుడు మౌనంగా ఉండిపోతాడు. 23ఏళ్ల పాటు దేవేంద్ర వైభవంగా పరిపాలించిన పాండవులు ఇప్పుడు మృగ చర్మాలు ధరించి అడవుల పాలయ్యారు. దీనితో సభాపర్వం ముగిసినది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## 'గురునిలయం'లో దుప్పట్లు పంపిణీ



నెల్లూరు మూలాపేటలో ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మందిరం -గురునిలయంలో ఇటీవల దుప్పట్ల పండుగ నిర్వహించి సుమారు 5వేల మంది పేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తలుపూరు శ్రీ నారాయణదాసుస్వామి చేతులమీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. వెంకయ్యస్వామి శిష్యులు, తమ తండ్రి మాకాని వెంకట్రావు 20 ఏళ్ళ క్రితం పేదలకు తమవంతు సామాజిక సేవగా ఈ దుప్పట్ల పండుగ ప్రారంభించారని, ఆనాటి నుంచి వారి దివ్యాశీస్సులతో, శ్రీ వెంకయ్యస్వామి కృపతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని గురునిలయం నిర్వాహకులు మాకాని గోపి తెలిపారు.

## వాన.. దంచికొట్టింది

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. నగరంలో సోమ, మంగళవారాల్లో వాన దంచికొట్టింది. మంగళవారం రోజున నెల్లూరులో 90.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు రాలేదో అని అల్లాడుతున్న జిల్లా రైతులకు సంతోషం, ఎండల దెబ్బకు ఇబ్బందిపడుతున్న నగర ప్రజలకు చల్లని వాతావరణం ఊరటనిచ్చాయి. అయితే, ఈ వానదెబ్బకు నెల్లూరురోడ్లు షరా మామూలుగానే మురుగు కాలువలయ్యాయి. భూగర్భ డ్రేనేజీ వ్యవస్థ బాగుపడేదాకా ఈ దుస్థితి మారదు మరి!..

## పిఆర్ చట్టంపై అవగాహన

జడ్పీ సీఇఓ చిరంజీవి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ చట్టంపై జిల్లాలోని పలు మండల, గ్రామ స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి ఈనెల 21న నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీ రాజ్ చట్టంలో వచ్చిన మార్పులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, పాలనలో చట్టం పాత్రపై అవగాహన కలిగించారు.

## మూలస్థానేశ్వరాలయంలో...
# వేమిరెడ్డి దంపతుల పూజలు



ఎంతో పవిత్రమైన కార్తీకమాసం కోటి సోమ వారం సందర్భంగా ఈ నెల 19వ తేదీన రాజ్యసభ సభ్యులు, వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్), ఆయన సతీమణి.. తిరు మల తిరుపతి దేవస్థా నాల ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత, వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాల్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ఆవరణలో వారు కార్తీక దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు భక్తులకు విపిఆర్ ప్రసాదాలు పంచిపెట్టారు.

### శివకేశవారాధన శుభప్రదం - ప్రశాంతిరెడ్డి

ఈ కార్యక్రమంలో ప్రశాంతిరెడ్డి భక్తులతో మాట్లాడుతూ, కార్తీక మాసంలో కోటి సోమవారం సందర్భంగా మూలస్థానేశ్వరస్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్తీక మాసం శివ-కేశవులు ఇద్దరికీ ప్రీతిపాత్రమైనదని, ఈ మాసంలో చేసే దైవారాధన శుభఫలితాలను ఇస్తుందని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1, 2, 3తేదీల్లో కార్తీకమాస లక్ష దీపోత్సవాన్ని నగరంలోని వీఆర్‌సీ మైదానంలో వైభవంగా నిర్వహిస్తున్నామని భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ప్రభగిరిపట్నంలో 25 నుంచి..కైలాసనాథుని ఉత్సవాలు

పొదలకూరు మండలంలోని ప్రభగిరిపట్నంలో కొలువైవున్న పార్వతీదేవి సమేత శ్రీ కైలాసనాథస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి 27వ తేదీదాకా ఆలయ ఆరవ వార్షికోత్సవ వేడుకలతో పాటు, కార్తీకదీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ బాణలింగ క్షేత్రంగా పేరొందిన ఈ పుణ్యక్షేత్రంలో ఇటీవల నిర్మించిన నూతన కల్యాణవేదికపై ఈనెల 25న స్వామివారి కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహిస్తామన్నారు. 26వ తేదీ సాయంత్రం ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, 27వ తేదీ సాయంత్రం కన్నులపండువగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం శ్రీ పార్వతీదేవి సమేత కైలాసనాథ స్వామికి, శ్రీ అయ్యప్పస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారికి ప్రభ, జ్వాలాతోరణం, పల్లకిసేవ ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

# ఏఎంసి ఛైర్మన్‌గా పేర్నేటి ప్రమాణస్వీకారం

## పాల్గొన్న కాకాణి, ఆదాల



నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసి) ఛైర్మన్‌గా పేర్నేటి కోటేశ్వరరెడ్డి, వైస్‌ఛైర్మన్‌గా ఒట్టూరు సుధాకర్, నూతన పాలకమండలి డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరులోని జీపిఆర్ గ్రాండ్‌లో ఇటీవల అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవ సాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు అగ్రికల్చర్ మార్కె టింగ్ కమిటీకి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అదనపు నిధులు మంజూరుచేసి మార్కె టింగ్ కమిటీని అన్ని విధాల ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రైతు లకు మెరుగైన సేవలందించాలని పాలక మండలికి ఈ సందర్భంగా ఎంపీ ఆదాల సూచించారు. ఈ కమిటీకి ప్రత్యేక నిధులు అందజేయాలని మంత్రి కాకాణిని కోరారు. నూతన ఏఎంసీ కమిటీ ఛైర్మెన్ పేర్నేటి కోటేశ్వర్‌రెడ్డికి, కొత్త పాలకమండలికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం పేర్నేటిని అందరూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య అధ్యక్షత వహించగా, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, గూడూరు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత, నాయకులు వైవి రామిరెడ్డి, సిహెచ్ హరిబాబుయాదవ్, వేలూరు శివ సునీల్‌రెడ్డి, మొయిళ్ల గౌరీ, మల్లు సుధాకర్ రెడ్డి, కోడూరు మీరారెడ్డి, కో-ఆప్షన్ సభ్యు రాలు సయ్యద్ మొబీనా, రవికుమార్, జయవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి - సింధు దంపతుల సౌజన్యంతో..
# జొన్నవాడలో..'లక్ష దీపోత్సవ' కాంతులు





పవిత్రమైన కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో లక్షదీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్తీక దీపకాంతులతో ఆలయం దేదీప్యమానమైంది. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా జరిగిన ఈ ఉత్సవంలో తొలుత ఆలయ వేదపండితులు వేదమంత్రాలతో లక్షదీపోత్సవానికి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం స్వామి వారికి, అమ్మవారికి విశేషపూజలు చేసి, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, నవావరణ పూజలు నిర్వహించారు. ఉభయ దాతలు పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి, సింధు దంపతుల ఆధ్వ ర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ లక్షదీపోత్సవ వేడుక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

అనంతరం, నందివాహనోత్సవం కన్నులపండువగా జరి గింది. ఆలయ పాలకమండలి వారు, అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరించారు.









# శ్రీసిటీలో 'టీహెచ్‌కె ఇండియా'.. 'ఓపెన్ హౌస్' వేడుక

దేశంలో తమ మార్కెట్ విస్తరణ, కొత్త అవకాశాల పెంపు ధ్యేయంగా శ్రీసిటీలోని టీహెచ్‌కె ఇండియా ప్రై.లి. పరిశ్రమ ఈనెల 20వతేదీ తమ ప్లాంట్ ఆవరణలో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించింది. ఈ పరిశ్రమ జపాన్‌కు చెందిన ప్రముఖ టీహెచ్‌కె కంపెనీ అనుబంధ సంస్థ. ఇది దేశంలో వివిధ రంగాలలో వినియోగించే లీనియర్ మోషన్ గైడ్‌లు, ఇతర పరికరాలను ఉత్పత్తి చేసే ఏకైక ఉత్పత్తి కేంద్రం. ఆ కంపెనీ సీఈఓ, టీహెచ్‌కె ఇండియా ఛైర్మెన్ అకిహిరో తెరామాచి ఈ వేడుకను ప్రారంభించారు. జపాన్ మాజీ రాయ బారి యసుకుని ఇనోకి, కాన్సుల్ జనరల్ మసయుకి టాగా, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ కమిషనర్ సిహెచ్ రాజేశ్వరరెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకిహిరో తెరామాచి మాట్లాడుతూ, కస్టమర్ల డిమాండ్, భారతదేశం ఆర్థిక వృద్ధి, ప్రభుత్వ 'మేక్ ఇన్ ఇండియా విధానం' కారణాలుగా భారతదేశంలో తమ మొదటి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీసిటీ డీటీజెడ్‌లో 50 ఎకరాల స్థలంలో సుమారు రూ.600కోట్లు పెట్టుబడితో నెల కొల్పిన ఈ పరిశ్రమలో దాదాపు 400 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, శ్రీసిటీ వారి సహకారానికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలోని ఏకైక లీనియర్ మోషన్ గైడ్స్ తయారీ కంపెనీ వేడుకకు హాజరైనందుకు చాలా గర్వంగాఉందని కాన్సుల్ జనరల్ మసయుకి టాగా చెప్పారు. జపనీస్ పెట్టుబడిదారులకు రాష్ట్ర ప్రభుత్వం, శ్రీసిటీ అందిస్తున్న సహాయ సహకారాలను ఆయన ప్రశంసించారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి ఎక్కువ మంది జపనీయులు శ్రీసిటీని ఇష్టపడతారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో మరో ప్రముఖ పరిశ్రమ శ్రీసిటీలో కొలువుతీరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. దేశంలోనే ఇది టీహెచ్‌కెకి చెందిన ఏకైక తయారీ కేంద్రంగా దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దీంతోపాటు పలు భారీ తయారీ పరిశ్రమలు ఖచ్చితంగా శ్రీసిటీకి తరలివస్తాయని ఆయన తన ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'ఫ్రెండ్స్ వాకర్స్' ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు ఏసీ స్టేడియం లోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ శివమౌర్యగుప్త సారధ్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి వాకర్స్‌కు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. మధుమేహవ్యాధి పరీక్షలు, బీపీ పరీక్షలు చేసి, వారి సందేహాలను నివృత్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు తలపనేని హరిబాబునాయుడు, కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్ అహ్మద్, దబ్బుఐ జిల్లా కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, రీజనల్ కౌన్సిలర్ ఏకొల్లు రాఘవరెడ్డి, గౌరవాధ్యక్షులు జీవీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




# శ్రీసిటీ ప్రగతి అద్భుతం

## జపాన్ రాయబార కార్యాలయ బృందం ప్రశంస



జపాన్ రాయబార కార్యాలయ బృందం ఇటీవల శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక వాడల్లో ఒకటిగా పేరొందిన శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం పుష్కలంగా ఉందని, శ్రీసిటీ ప్రగతి అద్భుతమని ఈ సందర్భంగా బృందం కొనియాడింది. భారత్‌లోని జపాన్ రాయబార కార్యాలయ ఆర్థిక మంత్రి క్యోకో హోకుగో నేతృత్వంలోని నలుగురు రాయబార కార్యాలయ ఉన్నతాధికారుల బృందం ఈ సందర్శనకు వచ్చింది. రాయబార కార్యాలయ ప్రథమ కార్యదర్శులు మసాహిరో కవాకమి, జుని చిరో సుజుకి, చెన్నైలోని జపాన్ కాన్సులేట్ అధికారి నవోకో యుజావా ఈ పర్యటనలో పాల్గొన్నారు. తొలుత, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) వారికి స్వాగతం పలికారు. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ శ్రీసిటీ ప్రత్యేకతలను వారికి వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యాపార సామర్థ్యం, పరిశ్రమ అనుకూల వాతావరణం పట్ల క్యోకో హోకుగో సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో 'నంబర్ వన్' ఇండస్ట్రియల్ పార్కుగా పేరుగాంచిన శ్రీసిటీ అభివృద్ధిని చూడగలగడం తనకు సంతోషంగా ఉందన్న ఆమె, శ్రీసిటీ వ్యాపార సామర్థ్యాన్నిజపనీస్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి పరిచయం చేసి, ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు సిఫార్సు చేస్తామన్నారు. జపాన్ రాయబార కార్యాలయ బృందం శ్రీసిటీ సందర్శన పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా గుర్తించబడిన శ్రీసిటీలోని వ్యాపార అనుకూల వాతావరణం వీరిని ఆకర్షించడంతో పాటు పెట్టుబడులను పెంచడానికి దోహదం చేస్తాయన్నారు. జపనీస్ భారీ పరిశ్రమలకు తోడ్పాటును అందించే సరఫరా గొలుసు సంస్థలు తమ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహక పర్యావరణ ఇక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీసిటీని నేరుగా సందర్శించడం, వ్యాపార అవకాశాలను అంచనా వేయడం, మరిన్ని జపనీస్ పెట్టుబడుల సాధ్యాసాధ్యాలను పరిశీలించడం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారుల బృందం పర్యటన సాగింది. అనంతరం, శ్రీసిటీలోని జపనీస్ పరిశ్రమల ప్రతినిధులతో వీరు ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు.

## జపాన్ బృందం సందర్శన

జపాన్‌లోని ప్రముఖ కార్పొరేషన్‌లు, వివిధ రంగాలలోని వ్యాపార సంస్థలకు చెందిన 25మంది వ్యాపార ప్రతినిధుల బృందం శ్రీసిటీని సందర్శించింది. జపనీస్ ప్రముఖ ప్రచురణ సంస్థ నిక్కన్ కోగ్యో షింబున్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన ఈ కార్యక్రమానికి జమైకాలోని జపాన్ మాజీ రాయబారి మసనోరి నకనో, నిక్కన్ కోగ్యో షింబున్ అధ్యక్షుడు ఇమిజు హరుహిరో సారథ్యం వహించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, దేశంలో జపాన్ కంపెనీలకు రెండో అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ నిలిచిందన్నారు. ఇదే తరహా పర్యటన 2017 అక్టోబర్‌లో జపాన్ పారిశ్రామికవేత్తలు కూడా చేపట్టారని, ఆ పర్యటనలో టీహెచ్‌కె సీఈఓ, శ్రీసిటీ ప్రత్యేకతలు మెచ్చి, ఇక్కడ ప్లాంట్ నెలకొల్పడానికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. గతంలో చెన్నైలో జపాన్ కాన్సుల్ జనరల్‌గా పనిచేసిన మసనోరి నకనో, తన గత పర్యటనలను గుర్తుచేసుకుంటూ, శ్రీసిటీ వేగంగా అభివృద్ధి చెందడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# ఉత్తమ విద్యార్థులకు..రామ్ అభినందనలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల కరెస్పాండెంట్, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తమ విద్యాసంస్థల్లో ఇటీవల ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులను అభినందించారు. అగ్రిసెట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన ఎన్‌బికెఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శివశంకర వరప్రసాద్ (8వ ర్యాంక్), ఎస్. మౌనిక (27వ ర్యాంకు), జె. మీనాక్షి (32వ ర్యాంకు) లను, ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న పి.లావణ్య, ఆర్.హిమజలకు ఆయన వాకాడులోని తమ నివాసంలో శుభాభినందనలు తెలిపారు. ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తున్న గోవిందు మాధవయ్య డాక్టరేట్ పొందిన సందర్భంగా, ఆయన్ను కూడా రామ్ అభినందించారు.

# మునిసిపల్ కార్మికుల ధర్నా



మునిసిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 20న నెల్లూరులోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నాందోళన చేశారు. మునిసిపల్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన జగన్, అధికారం చేపట్టి నాలుగున్నరేళ్ళు గడిచిపోయినా ఆ హామీ విషయం పట్టించుకోవడం లేదని, ఇకనైనా కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని విజ్ఞప్తిచేశారు. మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచలయ్య, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్, నాయకులు కొండా ప్రసాద్, అశోక్, సునీల్, సుజాతమ్మ, దేశమూర్తి, చెన్నయ్య, లోకేష్ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఓటర్ లిస్టులో తప్పులను సరి చేయాలి

**ఆర్డీఓ కిరణ్ కుమార్**



ఇంటింటి సర్వే చేసి ఓటర్ లిస్టుల్లో ఉన్న తప్పులను సరిచేయాలని ఆర్డీఓ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల తహశీల్దార్లు, బూతు లెవెల్ అధికారులతో ఓటర్ లిస్టుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులో సవరణలు వీలైనంత త్వరగా పారదర్శకంగా పూర్తి చేయాలని తెలియజేశారు. ఫామ్ 6 మరియు 7 వినియోగంపై క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు మరియు సిబ్బందికి సూచించారు.

# మదర్ థెరిసా బాటలో నడవాలి



అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా గూడూరు, నరసింగరావుపేటలోని బాలసదన్‌లో మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించి, న్యాయవాదుల తరపున అక్కడున్న పిల్లలకు చాక్లెట్లు, విద్యాసామాగ్రి అందజేయడం జరిగింది. ఆరవ పార్వతయ్య మాట్లాడుతూ పిల్లలందరూ మదర్ థెరిసాని ఆదర్శంగా తీసుకొని ఆమె బాటలో నడిస్తే మన జీవితం బాగుంటుందని, పిల్లలందరూ మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు చరిష్మారెడ్డి, సుమన్, కోర్టు ఉద్యోగి పివిఎల్ రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



# అధ్వాన్నంగా.. తిలక్‌నగర్ రోడ్డు

గూడూరు పట్టణంలోని తిలక్‌నగర్‌లో చిన్నపాటి వర్షానికే రోడ్లపై వర్షపు నీరు చేరి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. గూడూరు పట్టణానికి వచ్చేందుకు, కొండాగుంట, కాంద్ర, వెందోడు, తిమ్మసముద్రం, వెంకటేసుపల్లి, అరిమేనుపాడు, జయంపు, పాలిచర్ల, వెడిచర్ల గ్రామాలకు వెళ్ళే ప్రజలకు ఈ రోడ్డు మార్గం ఇబ్బందికరంగా మారింది. రోడ్డు ఎగుడుదిగుడుగా, గతుకులు, గుంతలు ఉండటంతో రాత్రులు వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా అంచుల్లో మట్టి లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నరు. కార్లు, లారీలు అంచుల్లో ఇరుక్కుని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ఈ రోడ్డును బాగుచేయాలని ఆ గ్రామల ప్రజలు కోరుతున్నారు.

## 25న బ్రాహ్మణ భవనం

# అదనపు గదుల ప్రారంభం

గూడూరులోని ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనంలోని అదనపు గదులను ఈ నెల 25వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు గూడూరు బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య అధ్యక్షులు యరగుడిపాటి చలపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కిరణ్‌కుమార్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎం.సూర్యనారాయణరెడ్డి, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని అదనపు గదులను ప్రారంభిస్తారని, బ్రాహ్మణ సంఘం సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## "మయూరి" శ్యామ్‌కు

# రోటరీ 'సత్కార్' అవార్డు



శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్)కు రోటరీ క్లబ్ 2022–2023 సంవత్సరానికి 'సత్కార్' అవార్డును ప్రదానం చేసింది. బొంబాయిటు గోవా "కోస్టా సెరెనా క్రూయిస్"లో నిర్వహించిన సత్కార్ అవార్డు ప్రదానోత్సవంలో మాజీ రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మహేశ్ కొట్బాగి, మాజీ రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వెంకటేష్ మరియు 3160 మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఒమ్మిన సతీష్‌బాబులు మయూరి శ్యామ్‌యాదవ్‌కు అవార్డును అందజేశారు. 2022 – 2023 సంవత్సరానికి అసిస్టెంట్ ట్రైనర్‌గా కోస్టల్ జోన్2లో ఉన్న క్లబ్స్‌ను సమన్వయ పరిచినందుకుగాను మయూరి శ్యామ్ యాదవ్‌కు ఈ అవార్డు అందించడం జరిగింది.

# శివాలయాల్లో నాగుల చవితి

గూడూరులోని పలు శివాలయాల్లో నాగుల చవితి పండుగ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుండి భక్తిశ్రద్ధలతో మహాశివునికి పాలాభిషేకాలు, అర్చనలు అష్టోత్తరాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులచవితి నాడు మహాశివుని మనసారా పూజిస్తే స్వామి అనుగ్రహం కలుగుతుందని భక్తుల నమ్మకం. అలాగే శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి తెల్లవారుజాము నుండి అభిషేకాలతో పాటు సహస్రనామాలు అష్టోత్తరాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు నెయ్యాభిషేకం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపా కటాక్షాలను పొందారు.




# ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వివిఎస్‌యు)లో ఇద్దరు పరిశోధక విద్యార్థినులకు ఈనెల 20న వివిఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి డాక్టరేట్‌లు ప్రదానం చేసి వారిని అభినందించారు. వివిఎస్‌యులోని బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కొడాలి విద్యాప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థినులు మేడిబోయిన భావన, గోళ్ళ ప్రతిమలకు ఈ అవార్డులు లభించాయి. భావన 'స్క్రీనింగ్ అండ్ స్ట్రక్చరల్ క్యారెక్టరేజేషన్ ఆఫ్ యాంటీక్వోరమ్ సెన్సింగ్ సిగ్నల్ మాలిక్యూల్స్ ఐసోలేటెడ్ ఫ్రం మ్రిస్టికా ఫ్రాగ్రన్స్' అనే అంశంపై పరిశోధన చేయగా, ప్రతిమ 'ప్యూరిఫికేషన్ అండ్ బయోకెమికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ యాంటిక్వోరమ్ సెన్సింగ్ సిగ్నల్ మాలిక్యూల్స్ ఐసోలేటెడ్ ఫ్రం ఎడిబుల్ మష్రూమ్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు.

# పురందేశ్వరి చరిత్ర సృష్టిస్తారా!?



పురందేశ్వరి. దగ్గుబాటి పురందేశ్వరి. కుటుంబసభ్యులు "చిన్నమ్మ" అని ప్రేమగా పిలుచుకునే... తెలుగువారి యుగపురుషుడిగా చరిత్ర పుటలకెక్కిన నందమూరి తారక రామారావు కుమార్తెగా ప్రజా జీవితంలోకి ప్రవేశించిన పురందేశ్వరి.... ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్ష బాధ్యతల్లోకి అడుగుపెట్టారు.

ఒక్క అసెంబ్లీ సీటు గానీ, ఒక లోకసభ సీటు గానీ... స్వయంగా గెలుచుకునే స్థితిలేని పార్టీకి రాష్ట్ర నాయకత్వం వహించడం పెద్ద విషయం ఏమీకాదు.

అలాంటి పార్టీలు ఏ రాష్ట్రంలో అయినా ఓ నాలుగైదు ఉంటూనే ఉంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో సమతా పార్టీ అని ఒక పార్టీ ఉంది. ఇప్పుడు జై భీమ్ పార్టీ అని ఉంది. సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు కూడా ఒక్క సీటూ స్వయంగా గెలవలేని స్థితికి చాలాకాలం క్రితమే చేరుకున్నాయి.

అయితే, ఆ పార్టీలకు, బీజేపీ ఆంధ్రప్రదేశ్ శాఖకు చాలా తేడా ఉంది.

బీజేపీ దేశాన్ని ఏలుతోంది. దాని తరపున ప్రధాని పదవిలో ఉన్న నరేంద్ర మోడీ... భారతదేశపు "మైండ్ సెట్"నే సరికొత్తగా ట్యూన్ చేస్తున్నారు. దేశంలోనే అత్యంత ధనిక పార్టీ బీజేపీ.

జమ్ము, కశ్మీర్, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీ బీజేపీ.

దేశ నడకను కొత్త మార్గం పట్టించాలని అభిలషించే "భారతీయ"జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖకు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షురాలు.

ఆ పదవిలో ఆమె బీజేపీకి చిరస్మరణీయమైన వెలుగులను తీసుకువస్తారా? లేకపోతే... సోము వీర్రాజులాగా నాలుగు రోజులు ఆ పదవిలో కాలక్షేపం చేసి... ఓ ఫైన్ మార్నింగ్.. చడీచప్పుడు లేకుండా ఆ పదవి నుంచి దిగి వెళ్ళిపోతారా? ఆమెకు ఈ రెండు అవకాశాలూ ఉన్నాయి.

ప్రస్తుతానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉనికి కోసం బీజేపీ పెనుగులాడుతోంది. ఆ మాటకొస్తే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాజకీయాలలో బీజేపీది నామమాత్రపు పాత్రే. మతపరమైన రాజకీయ కార్యకలాపాలకు దక్షిణాదిన పెద్దగా అవకాశాలు లేవు. అందుకే, బీజేపీ దక్షిణాదిలో అడుగు ముందుకు వేయలేకపోతోంది.

కర్ణాటక రాజకీయాలలో కూడా బీజేపీకి ఉన్నది బలం కాదు. వాపు. ఇప్పుడు ఆ వాపూ చాలావరకు దిగిపోయింది. అక్కడ కులాలవారీగా మఠాధిపతులు ఉండడం, బీజేపీ... వారిలో కొందరిని ప్రసన్నం చేసుకోవడంతో... కర్ణాటకలో "ఉంది" అని అనిపిస్తుంది. ఇక, మిగిలిన రాష్ట్రాల్లో రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో మఠాలు లేవు.

చాలాకాలంగా తెలంగాణలో భీకర కసరత్తు చేస్తున్నప్పటికీ 119 స్థానాలు కలిగిన తెలంగాణ అసెంబ్లీకి ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో... బీజేపీకి 10సీట్లు మించి వస్తాయని చెప్పడానికి ఏ సర్వే సంస్థ కూడా సాహసించడం లేదు. కాకపోతే, ఢిల్లీ నుంచి అర్థబలం... పార్టీలో స్థానికంగా అంగబలానికి ఏమీ ఇబ్బంది లేదు గనుక, బిల్డప్‌కు లోటు లేదు.

తెలంగాణలో బీజేపీ పరిస్థితి అలా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అసలు స్వంతంగా పోటీచేసి, అసెంబ్లీకి గానీ... లోక్‌సభకు గానీ కనీసం ఒక్క సీటు గెలిచే పరిస్థితి లేదు.

అందుకే, బీజేపీ అనేది ఉత్తరాది పార్టీ అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తూ ఉంటారు. బీజేపీని ప్రధాని నరేంద్రమోడీ తన కనుసన్నల్లోకి తీసేసుకున్న తరువాత ఉత్తరాదితో పాటు, దక్షిణాదిలో కూడా తన 'ప్రభావం' చూపించాలని విశ్వ ప్రయత్నం చేస్తూ వస్తున్నారు.

ఇప్పుడు తెలంగాణలో బీజేపీ పరంగా జరుగుతున్న కసరత్తు అందులో భాగమే. ఎన్ని రకాలుగా తంటాలు పడినా.... పదికి మించి అసెంబ్లీ స్థానాలకు అవకాశం లేదంటున్నారు.

ఇటు తెలంగాణతో పాటు, అటు ఆంధ్రప్రదేశ్‌లో పాగా వేయడానికి ఏమి చేయాలా అని బీజేపీలో పెద్ద తలకాయలన్నీ ఢిల్లీ స్థాయిలో మల్లగుల్లాలు పడుతున్నట్టు ఒక సమాచారం వస్తోంది.

హైదరాబాద్ జంట నగరాలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి ప్రాంతాన్ని దేశ రెండో రాజధానిగా ప్రకటించడం అనేది బీజేపీ వ్యూహంలో ఒక భాగమని అంటున్నారు.

నిజానికి, రాజ్యాంగ రూపకల్పన దశలోనే, హైదరాబాద్ నగరం... రాజ్యాంగ నిర్మాతల దృష్టిని ఆకర్షించింది.

ఇంత పెద్ద దేశానికి ఢిల్లీ ఒక్కటే రాజధానిగా ఉండడం వల్ల దక్షిణాది ప్రజలకు దేశ రాజధాని "అందని ద్రాక్ష పుల్లన" అన్నట్టుగా తయారైందనే అసంతృప్తి దక్షిణాదిలో బలంగా ఉందనే విశ్లేషణలకు కొదువ లేదు.

ఈ సువిశాల, 140 కోట్ల మేర జనాభా విస్తరించి ఉన్న దేశ రాజధాని... కేవలం ఉత్తరాదికే పరిమితం అయివున్న ఫలితంగా దక్షిణాదివారిలో అసంతృప్తి రేగితే, దేశ ఐక్యతకు మంచిదికాదని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పన దశలోనే అభిప్రాయపడ్డారు. కనుక, దక్షిణాదికి ముఖ ద్వారం లాంటి హైదరాబాద్‌ను దేశానికి రెండవ రాజధానిగా ప్రకటించాలని ఆయన సూచించారు.

ఆ సూచన కార్యక్రమ రూపంలోకి రాలేదు.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన చాలాకాలానికి, తెలుగు ప్రాంతాలు అన్నిటినీ కలిపి, 1956లో హైదరాబాద్ రాజధానిగా ఒక తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేశారు.

అంబేద్కర్ సూచన అమలులోకి వచ్చి ఉన్నట్లయితే, తెలుగువారి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్ర, జీవనశైలి, ఆ మాటకొస్తే దక్షిణాది వారి జీవనశైలి ఊహకి సైతం అందనంత సమున్నత రీతిలో ఉండి ఉండేది.

ఈ "బురద గుంట" రాజకీయాలకు ఆస్కారమే ఉండేది కాదు.

"బతకని బిడ్డ బారెడు..." అన్న సామెత చందంగా ఇప్పుడు "చింతించి... చింతించి.... వగచిన..." ఫలితం లేదు కదా!





ఇప్పుడు ఆ ఆలోచనను బీజేపీ బయటకు తీస్తున్నట్టు వినికిడి.

అంటే, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి మరికాస్త విస్తరించి, దానిని కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడంతో పాటు, ఒక రాజధానికి నోచుకోని ఆంధ్రప్రదేశ్‌లో అమరావతిని దేశానికి రెండో రాజధానిగా ప్రకటించడం అనే ఆలోచనలపై ఢిల్లీలో కొందరు బీజేపీ నాయకులు ఆలోచిస్తున్నట్టు చెబుతున్నారు.

ఈ రెండూ ఏక కాలంలో ప్రకటిస్తే.. తెలుగు రాష్ట్రాల రూపురేఖలతో పాటు బీజేపీ ప్రొఫైల్ కూడా దక్షిణాదిన సంపూర్ణంగా మారిపోతుంది. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీకి కంచుకోటలుగా మారిపోవడంతో పాటు నాలుగు దక్షిణాది రాష్ట్రాల్లోనూ బీజేపీ... ఒక బలమైన రాజకీయశక్తిగా రూపుదిద్దుకుంటుంది. రెండు రాష్ట్రాల ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వరూపం మారిపోవడంతో పాటు దక్షిణాది రాష్ట్రాల జన హృదయాలకు బీజేపీ దగ్గరవుతుంది.

ఈ జంట ప్రతిపాదనలపై బీజేపీ ప్రధాన కార్యదర్శి, సంస్థాగత వ్యవహారాల నిపుణుడు బి.ఎల్.సంతోష్ ఇప్పటికే కొందరు ముఖ్యనాయకులతో సమగ్రంగా చర్చించినట్టు బీజేపీ వర్గాల నుంచి ఓ సమాచారం వినబడుతోంది.

అయితే, తెలంగాణలో పోలింగ్‌కు ఇప్పుడు ఓ వారం రోజులు కూడా వ్యవధి లేదు. అందువల్ల, ఈలోగా హైదరాబాద్‌పై కేంద్ర ప్రకటన వచ్చే అవకాశం లేకపోవచ్చు. ఈ సమయంలో అటువంటి ప్రకటన వంటిది ఏది వెలువడినా తెలంగాణ ముఖ్యమంత్రి తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టి, 2018లో లాగా ఎన్నికల లబ్ధి పొంద వచ్చునని కూడా బీజేపీ నాయకుడొకరు అన్నారు.

2018లో కాంగ్రెస్ గెలిచే వాతావరణం కనిపించింది. ప్రచారం చివరి ఘట్టం చేరుకున్న దశలో చంద్రబాబునాయుడు రంగప్రవేశం చేసి, కాంగ్రెస్‌తో కలిసి ప్రచారం చేయడాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి క్యాష్ చేసుకున్నారు. "ఆంధ్ర బూచి"ని చూపించి, తెలంగాణ వాదాన్ని రెచ్చగొట్టారు.

అటు అమరావతిని రెండో దేశ రాజధాని గాను, ఇటు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగానూ ఒకేసారి ప్రకటిస్తే మాత్రం... రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్థాయి అమాంతం పెరిగిపోతుంది అనడంలో సందేహం లేదు.

సరిగ్గా ఇక్కడే, దగ్గుబాటి పురందేశ్వరికి "చారిత్రాత్మక" పాత్ర ఉంది.

ఢిల్లీ కేంద్ర నాయకులతో తనకు గల రాజకీయ పరిచయాలన్నింటినీ ఏకోన్ముఖం చేసి అమరావతి ప్రాంతాన్ని దేశ రెండో రాజధానిగా ప్రకటింపచేయడానికి శక్తి వంచన లేకుండా కృషిచేయాలి. ఇందుకు ప్రాతిపదిక లేకపోలేదు.

నరేంద్ర మోడీ అయితే, 2014 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ వాసులకు దాదాపు ఇటువంటి ఆశలనే కల్పించారు కూడా.

"నేను ప్రధాన మంత్రి అయితే, ఢిల్లీతో పోల్చతగిన రాజధానిని ఆంధ్రాలో నిర్మింపచేస్తాను అని ఈ తిరుపతి వెంకన్న సాక్షిగా చెబుతున్నాను" అని మోడీ తిరుపతి బహిరంగ సభలో ప్రకటించారు.

ఒకవేళ, అమరావతిని దేశ రెండో రాజధానిగా ప్రకటించాలని ఆయన భావించే పక్షంలో... సుమారు 32 వేల ఎకరాల ఖాళీ భూమి సిద్ధంగా ఉంది. దానికి దగ్గర్లో మరో ఇరవై వేల ఎకరాల అటవీ భూమి, నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా మరో ఆరువేల ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉందని అంటున్నారు. హైదరాబాద్ విషయానికి వస్తే, ఈరోజు కాకపోతే రేపైనా కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారని జనంలో ఒక అభిప్రాయం గట్టి ప్రచారంలో ఉంది. అమరావతి విషయంపై బీజేపీలోనే ఒక స్థాయిలో చర్చ జరిగిందనే సమాచారం బీజేపీ వర్గాల నుంచి ఉన్నప్పటికీ, అది ఇంకా జనంలోకి వచ్చినట్టు లేదు.

చిన్నమ్మ చరిత్ర సృష్టిస్తుందా?

ఆంధ్రప్రదేశ్ బీజేపీకి ఎన్‌టీ రామారావు కుమార్తె, డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు సతీమణి, కేంద్ర మాజీమంత్రి అయిన పురందేశ్వరిని అనూహ్యంగా నియమించారు. నిజానికి ఆమెకు పార్టీ కేంద్ర స్థాయిలో పదవి ఏదైనా ఇవ్వడమో, ఏదైనా ఓ రాష్ట్రానికి గవర్నర్‌గా పంపడమో చేస్తారని చాలామంది ఊహించారు. ఆ స్థాయి హుందాతనం, గంభీరతకు ఈ "బురద గుంట" రాజకీయాలు పెద్దగా సూటవ్వవు. నిజానికి, ఈ తరహా పదవికి సోము వీర్రాజు లాంటి నేతలే బెస్టు. రాష్ట్ర బీజేపీలో ఉన్నారు కూడా.

అయితే, అనూహ్యంగా రాష్ట్ర పార్టీ పగ్గాలు ఆమె చేతికి అప్పగించారు. ఆమె, చంద్రబాబు నాయుడు గారి శ్రీమతి భువనేశ్వరికి సోదరి. తెలుగుదేశంకు, పురందేశ్వరి ప్రాతినిధ్యం వహించే బీజేపీకి రాజకీయంగా సరిపడడం లేదు. ఈ ఈక్వేషన్ తెలిసి కూడా పురందేశ్వరిని రంగంలోకి దింపారు.

సోము వీర్రాజు స్థానంలో పురందేశ్వరి వచ్చినా, మామూలుగా అయితే బీజేపీ తల రాత మారే అవకాశమే లేదు, ఏదో అద్భుతం జరిగితే తప్ప.

ఆ అద్భుతమే దేశ రెండో రాజధానిగా అమరావతి ఏర్పాటు.

రాష్ట్ర ప్రభుత్వంపై రోజువారీ విమర్శలు, కేంద్రానికి ఫిర్యాదులు, క్షేత్రస్థాయి పర్యటనల వల్ల, బీజేపీకి ఒక ఓటు కొత్తగా రాదు... ఒక ఓటు పోదు అనే విషయాన్ని పురందేశ్వరి గమనించాలి.

సోము వీర్రాజు హయాంలో బీజేపీ ఓటు బ్యాంకు ఎంత ఉందో... పురందేశ్వరి హయాంలోనూ అంతే ఉంటుంది.

అందుకే, దేశ రెండవ రాజధానిగా అమరావతి అనే అంశాన్ని ఆమె ఢిల్లీ పెద్దల దృష్టికి బలంగా తీసుకువెళ్ళాలి. ఆమె శక్తియుక్తులన్నీ ఆ అంశంపై కేంద్రీకరించాలి. తద్వారా బీజేపీకి దక్షిణాదిన ప్రాణప్రతిష్ట చేయాలి. అటువంటి కృషి చేసిన నేతగా ఆమె దేశ చరిత్రలో నిలిచిపోతారు. బీజేపీని తెలుగు రాష్ట్రాల్లో హిమాలయాల ఎత్తుకు తీసుకెళ్లిన నేతగా ఆమె రాజకీయం చరితార్థం అవుతుంది.


తెలుగు ప్రజలు ఎదుర్కొంటున్న సవాలక్ష సమస్యలకు అర్థవంతమైన శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# కల్యాణ వైభోగం...!




ప్రముఖ పారిశ్రామికవేత్త దొడ్ల డెయిరీ ఛైర్మన్ దొడ్ల శేషారెడ్డి - గిరిజల మనుమడు, దొడ్ల సుబ్బారెడ్డి - భార్గవిల కుమారుడు **రాహుల్ - చాందిని** (చెన్నై వాస్తవ్యులు మురళీ - శ్రీవిద్యల కుమార్తె)ల పెళ్లి నవంబర్ 19వ తేదీ మద్రాసులో జరిగింది. కొత్త దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.




నెల్లూరులోని జిపిఆర్ కళ్యాణ మండపం అధినేత గునపాటి వెంకటకృష్ణారెడ్డి - ప్రశాంతిలక్ష్మిల కుమారుడు **గీతా కృష్ణ సాయి - హర్షిణి** (ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, మధు చిన్నపిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ రేబాల మధుసూదన్‌రెడ్డి - రజనిల కుమార్తె)ల పరిణయం నవంబర్ 18వ తేదీ నెల్లూరులో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# గెలిచిందెవరు.. ఓడిందెవరు..?

(మొదటి పేజీ తరువాయి)

నువ్వే పెద్ద దొంగ అంటూ పరస్పరం నిందించు కుంటూ కాలం గడిపేయవచ్చు.

## ఈ పని రాజశేఖరరెడ్డే చేసుండొచ్చు!

సంపూర్ణమైన మెజారిటీతో అనూహ్యమైన విజయం సాధించి 2004లో ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి. ఆయనకి ముందు వరుసగా తొమ్మిదిన్నర సంవత్సరం చంద్రబాబు రాష్ట్రాన్ని పాలించారు. ఆయన రెండు పర్యాయాల పరిపాలనలో అనేక అవకతవకలు, అవినీతి ప్రహసనాలు జరగకుండా ఉండే ప్రసక్తే లేదు. అవన్నీ లోడి, కావాలంటే చంద్రబాబుని రాజశేఖరరెడ్డే లోపల వేయించి ఉండొచ్చు. కానీ, రాజశేఖరరెడ్డి అవేమీ పట్టించుకోలేదు. అవతల పార్టీ ఏం చేసిందన్న ప్రశ్నకే ఆయన ఎక్కడా అవకాశం ఇవ్వలేదు. కక్ష పూరిత రాజకీయాలు చేయలేదు. తానేం చేయాలో దాని పైనే దృష్టిపెట్టారు. చంద్రబాబుని, ఆయన పార్టీని కనుమరుగు చేసి, తాను శాశ్వతంగా ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవాలన్న లక్ష్యాన్ని తన ముందు పెట్టుకుని శ్రమించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారు. అంత చేసినప్పటికీ 2009లో కొద్ది సీట్లతోనే మళ్లీ అధికారం రావడంతో రచ్చబండకి శ్రీకారంచుట్టి, నేరుగా ప్రజల గడపలవద్దకు వెళ్లి వారి మనసులలో చిరస్థాయిగా కొలువైపోవాలనుకున్నారు. అదే రచ్చబండ కార్యక్రమానికి వెళ్తూ అసువులుబాశారు.

## ట్రెండు మారిన ఆంధ్ర పాలిటిక్స్!

ఉమ్మడి రాష్ట్రం రెండు ముక్కలై అనాధాంధ్ర ఏర్పడ్డ తరువాత రాజకీయం ట్రెండు మారింది. జగన్ అధికారంలోకి వచ్చిన క్షణం నుండి కొత్త రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా 2014 నుండి 2019వరకూ చంద్రబాబు చేసిన పాలనపైన దృష్టిసారించారు. వచ్చీరాగానే ప్రజావేదికని కూలగొట్టి తన మార్కు పరిపాలన ఎలా ఉండబోతోందన్న సంకేతాలని జగన్ స్పష్టంగా ఇచ్చారు. బాబు పాలనలో తీసుకున్న నిర్ణయాలన్నిటినీ ఒక్కొక్కటిగా సమీక్షించడం మొదలుపెట్టారు. ప్రధానంగా రాజధాని నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మూడు రాజధానుల ప్రతిపాదన తెరపైకితెచ్చి, ఆ దిశగా అడుగులువేశారు. బాబు అవినీతి భాగోతాలని బూతద్దం పెట్టి వెతకడం మొదలుపెట్టారు. స్కిల్ స్కామ్ బాణాన్ని ముందుగా బాబుపై వదిలి విజయవంతంగా లోపలకి పంపించారు. ఇసుక, మద్యం, మైనింగ్ వంటి వాటితో పాటు ఇంకా చాలా ఉన్నాయంటూ గుప్పిట మూసిపెట్టారు. ఇప్పుడు బాబుకి సాధారణ బెయిలు వచ్చింది. కేసుల వ్యవహారం ఢిల్లీకి చేరింది. ఈ నేపథ్యంలో గెలిచిందెవరు.. ఓడిందెవరు..? అన్న విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. న్యాయస్థానాల్లో ఇద్దరిలో ఎవరిది పైచేయి అయినా, తుది తీర్పు మాత్రం ప్రజలే ఇస్తారంటున్నారు విశ్లేషకులు!

### చెంగాళమ్మ దేవస్థానం

# ఇన్‌ఛార్జ్ ఇఓగా అరవభూమి



వెంకటగిరి పోలేరమ్మ మరియు నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయాల ఇ.ఓగా ఉన్న అరవభూమి వెంకట శ్రీనివాసులరెడ్డిని సూళ్లూరుపేట చెంగాళమ్మ దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా దేవాదాయశాఖ నియమించింది. ఈమేరకు ఆయన ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. చెంగాళమ్మ దేవాలయ ఇ.ఓగా ఉన్న ఆళ్ళ శ్రీనివాసులరెడ్డి దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో అరవభూమి నియమితులయ్యారు. జనవరి 31వ తేదీ వరకు ఆయన ఈ స్థానంలో కొనసాగుతారు.

# కార్పొరేషన్‌లో ఘనంగా అభివృద్ధి పనులు

**- డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్**



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలో గతంలో కంటే మిన్నగా అనేకరకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నెల్లూరు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని, అలాంటి సంక్షేమ ప్రభుత్వంలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పి.రూప్ కుమార్‌యాదవ్ చెప్పారు. కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల22న నెల్లూరు కార్పొరేషన్‌లోని తమ ఛాంబర్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రెండేళ్ళ కాలంలోని పలు అభివృద్ధిపనులను ప్రస్తావించారు. కార్పొరేషన్ ప్రాంగణంలో రూ.15కోట్లతో కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభం కానుందని తెలిపారు.

# ఎన్‌బికెఆర్ అధ్యాపకునికి డాక్టరేట్



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అధ్యాపకునిగా పనిచేస్తున్న గోవింద మాధవయ్యకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వారు ఈనెల22న డాక్టరేట్ ప్రదానం చేశారు. 'ఏ క్రిటికల్ రీడింగ్ ఆఫ్ ఆర్‌కె నారాయణన్స్ సెలెక్ట్ ఫిక్షన్స్-ఏ స్టడీ' అనే అంశంపై విడవలూరు డిగ్రీ కళాశాలలోని డా.వి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా. వి.విజయ కుమార్‌రెడ్డి, విభాగాధిపతి డా. సి.రవీంద్రరెడ్డి ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి మాధవయ్య కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు



దేశంలోని ప్రముఖ వ్యాపార ప్రచురణ సంస్థ మరియు వ్యాపార రంగంలో లోతైన విశ్లేషణకు ప్రసిద్ధి చెందిన బిజినెస్ వరల్డ్ నిర్వహించిన సస్టైనబుల్ వరల్డ్ కాన్‌క్లేవ్ అండ్ అవార్డ్స్ 5వ ఎడిషన్‌లో 'ఇండియాస్ మోస్ట్ ఇన్నోవేటివ్ సస్టైనబిలిటీ ప్రాజెక్ట్ ఆఫ్ ది ఇయర్' అవార్డును శ్రీసిటీ సొంతం చేసుకుంది. ఈనెల 21న ముంబైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బిజినెస్ వరల్డ్ ఛైర్మన్-ఎడిటర్-ఇన్-చీఫ్ డాక్టర్ అనురాగ్‌బాత్రా నుండి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో సంతోషం వ్యక్తంచేస్తూ, ఇది శ్రీసిటీ నిబద్ధతకు గుర్తింపు అని సంతోషం వ్యక్తం చేశారు.

# అమెరికాలో కార్తీక మాస పూజలు - వనభోజనాలు!



భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచారాలు మన దేశంలో ఉన్నవారు తమ పిల్లలకి తెలియజేస్తున్నారో లేదో తెలియదు కానీ, అమెరికాలో ఉన్న భారతీయులు మాత్రం వాళ్ళ పిల్లలకి అన్నీ నేర్పిస్తున్నారు. మన పండుగల ప్రాశస్త్యాన్ని చెప్పడంతో పాటు కార్తీక మాసం యొక్క ప్రాముఖ్యతని కూడా రేపటి తరానికి అర్థమయ్యేలా చేస్తున్నారు. మొన్న 19వతేది ఆదివారం అమెరికా దేశం, ఫ్లోరిడా రాష్ట్రం, టాంపా నగరంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని అక్కడి తెలుగువారు ఘనంగా జరుపుకున్నారు. గౌరవెల్లి శ్రీధర్-సుధ, నాగబండి హరి-పద్మ దంపతులు తమ నగరంలోని ఉద్యానవనంలో ఈ కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాలను ఆహ్వానించారు. కార్తీక దీపాలు వెలిగించి, తమ పిల్లలతో వంటలు చేయించి కార్తీక మాసం ప్రాముఖ్యత, పవిత్రత గురించి వారికి వివరించి, అందరూ చక్కగా బంతి భోజనాలను ఆరగించారు. మనదేశంలో కూడా మహానగరాల్లో నివసిస్తున్న తెలుగువారు వారి పిల్లలకి ఇలాంటివి నేర్పిస్తే ఎంత బాగుంటుందో కదా!



హామీలు విస్మరించే...

# చంద్రబాబును నమ్మవద్దు

- ఎంపీ ఆదాల



ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయకుండా ప్రతిసారీ మాటతప్పే చంద్రబాబును నమ్మవద్దని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త దాల ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు రూరల్ పరిధిలోని 29వ డివిజన్‌లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమపథకాలను ప్రజలకు నేరుగా అందిస్తున్న ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తున్నది తమ ప్రభుత్వమేనన్నారు. ఒకవేళ చంద్రబాబు గెలిస్తే ప్రజలకు వస్తున్న అనేక సంక్షేమపథకాలు ఆగిపోతాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆయన కోరారు. 29వ డివిజన్‌లో అభివృద్ధికి ఇప్పటికే కోటీ 50 లక్షల వ్యయంతో రోడ్లను నిర్మించడం జరిగిందని, మరో కోటీ 58 లక్షలతో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తయిందని అంటూ, ఈ డివిజన్ అభివృద్ధి పనులకు మరో 2 కోట్ల రూపాయల నిధిని కూడా మంజూరు చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నెల్లూరు రూరల్‌లో అరాచకాలను అణచివేసి ప్రజలకు ప్రశాంతమైన సుపరిపాలన అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ ఛైరెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యులు స్వర్ణా వెంకయ్య, వైకాపా నాయకులు హరిబాబు యాదవ్, కార్పొరేటర్ డా. షేక్ సత్తార్, మర్రిపాడు జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రథమ చికిత్సల పై..రెడ్‌క్రాస్‌లో శిక్షణ



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్న సీనియర్ ప్రొఫెషనల్, వోచర్ ప్రథమ చికిత్స శిక్షణ ముగింపు కార్యక్రమం ఇటీవల జరిగింది. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ఎం.వి.సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ గురునాథరావు పాల్గొని మాట్లాడారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనలతో ఈ శిక్షణా తరగతులను నవంబరు 15 నుండి 19వ తేదీ వరకు నిర్వహించామని, అత్యవసర పరిస్థితులలో బాధితులకు చేయాల్సిన ప్రథమ చికిత్సలకు సంబంధించి 35 మందికి శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం, శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సరిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఏఓ సి.హెచ్.చంద్రశేఖర్‌రావు, కో-ఆర్డినేటర్ జి.వి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వెల్లంటిలో నూతన రామాలయం

నెల్లూరురూరల్ మండలం వెల్లంటి గ్రామంలో కొత్తగా నిర్మించిన రామాలయానికి ఈనెల 18న ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో వైకాపా నేత, డీసీసీబీ మాజీఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. రూరల్ మండల నాయకులు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నెల్లూరులో పురందేశ్వరి

### బీజేపీని బలోపేతం చేయాలని పిలుపు

భారతీయ జనతాపార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇటీవల నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చారు. నెల్లూరులో పార్టీ శ్రేణులతో సమావేశమై జిల్లాలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమె నెల్లూరు జిల్లాకు రావడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమెను పార్టీవర్గాలు ఘనంగా స్వాగతించాయి.

జిల్లా పార్టీ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి అధ్యక్షత్వంలో నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో పెద్దఎత్తున జరిగిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో కేంద్రప్రభుత్వం ద్వారా దేశంలోని అన్నివర్గాల ప్రజలకు అనేకరకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఆ వివరాలను ప్రజలకు పార్టీనాయకులు మరింత వివరంగా తెలియజెప్పాలని చెప్పారు. అనంతరం నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్‌కు చేరుకుని అధికారులతో మాట్లాడారు. ఈ రైల్వే స్టేషన్ ఆధునీకరణకు, ప్రయాణీకుల వసతులకు కేంద్రప్రభుత్వం 103 కోట్ల రూపాయలు కేటాయించిందని, అదేవిధంగా కృష్ణపట్నం కారిడార్ ఏర్పాటుకు, నెల్లూరు-కృష్ణపట్నం రోడ్ల నిర్మాణాలకు కేంద్రం ఆమోదం తెలిపిందని ఆమె వివరించారు. రాష్ట్రంలోని అనేక అభివృద్ధి పనులకు బీజేపి ఇస్తున్న నిధులను వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టిస్తూ, కేంద్రం ఆంధ్రకు నిధులేమీ ఇవ్వడం లేదంటూ దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రం ఇస్తున్న నిధులతోనే జరుగుతున్నాయన్నారు. రోడ్లు, రైల్వేలైన్‌లు, ఎయిర్‌పోర్టులు, పేదలకు ఇళ్ళు వంటి అభివృద్ధి పనులకు కేంద్రం చేయూతనిస్తోందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా, బీజేపీ లీగల్ సెల్ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు భరత్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కావలి సమీపంలోని ముసునూరులో జగనన్న ఇళ్లకాలనీలను పురందేశ్వరి పరిశీలించి, ఆ ఇళ్ల నాణ్యత అంతా అధ్వాన్నంగా ఉందని విమర్శించారు.

## డిసెంబరు 9న..జాతీయ లోక్‌అదాలత్

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ సి.యామిని తెలిపారు. ఈనెల 18న నెల్లూరులోని జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా సివిల్ జడ్జి..జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణితో కలసి విలేకర్ల సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. కేంద్ర-రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలతో నెల్లూరు, కోవూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, కోట, ఉదయగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేట కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తామని, రాజీ పడదగిన, పరిష్కరించదగిన కేసుల్లోని కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం లభిస్తుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇటీవల సోషల్‌వర్క్ విభాగం, ఆంధ్ర విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి పాల్గొని ఝున్సీలక్ష్మీబాయి చిత్రపటానికి పూలు సమర్పించి ఆమె పోరాటపటిమను వివరించారు. వీఎస్‌యు రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్ బాబు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మధుమతి, ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు టి.ప్రసాద్, సోషల్ వర్క్ విభాగం ప్రతినిధి బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...

### విడవలూరులో 'దిశ' చట్టంపై అవగాహన

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విడవలూరు లైబ్రరీలో ఈనెల 19న ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పోలీసు శాఖ నుంచి వచ్చిన శ్రీలేఖ బాలికలకు 'దిశ' చట్టంపై అవగాహన కలిగించారు. ఆడపిల్లలు రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పద్మావతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ముసునూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

కావలి సమీపంలోని ముసునూరు శివారుల్లో పేకాట స్థావరంపై కావలి రూరల్ పోలీసులు ఈనెల 19న దాడులు చేసి పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి 8,450 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

### సోమశిల డ్యామ్‌లో 29.5 టీఎంసిల నీళ్ళు

సోమశిల డ్యామ్‌కు ఎగువప్రాంతాల నుంచి నీటి ప్రవాహం వస్తోంది. దీంతో, ఈనెల19వతేదీ నాటికి డ్యామ్‌లో 17 క్యూసెక్కుల అదనపు ప్రవాహంతో నీటి నిల్వ 29.500 టీఎంసీలకు చేరుకుంది. డ్యామ్ పూర్తి నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు. ఈ నేపథ్యంలో, రైతుల కోసం డెల్టాకు 300 క్యూసెక్కులు, దక్షిణ-ఉత్తర కాలువలకు మొత్తంగా 90 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు.

### సంగంలో గ్రంథాలయం తనిఖీ

సంగం గ్రంథాలయాన్ని ఇటీవల ఆ శాఖ డెప్యూటి డైరెక్టర్ అహ్మద్ తనిఖీచేశారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మనుబోలులో రైతులతో సమావేశం

నీటిపారుదలశాఖ డెప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విజయ భాస్కర్‌రెడ్డి ఇటీవల మనుబోలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద కండలేరు ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. తెలుగుగంగ ద్వారా ఈ ప్రాంత రైతులకు నీటి విడుదల జరుగుతుందని, రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. డిఇఇ అనిల్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

### కోవూరులో ఇళ్ళ నిర్మాణాలపై సమీక్ష

కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ కాలనీలపై ఇటీవల కోవూరులోని గృహనిర్మాణశాఖ డెప్యూటి ఇంజనీర్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష జరిగింది. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని డెప్యూటి ఇంజనీర్ దయాకర్ చెప్పారు. ఏఇలు, వర్క్ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

### పడుగుపాడులో భక్తులకు అన్నవితరణ

కోవూరు సమీపంలోని చిన్నపడుగుపాడు నాగులపుట్ట వద్ద ప్రముఖ దాత రామిరెడ్డి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగుల చవితి రోజున పుట్ట వద్ద అన్నవితరణ జరిగింది. పడుగుపాడు సొసైటీ ఛైర్మెన్ ఆర్ మల్లికార్జునరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షుడు ఎస్ నరసింహులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజగోపాల్, మాజీ సభ్యుడు నారాయణ పాల్గొన్నారు.

### రామసాగరంలో రైతుభరోసా కేంద్రం పరిశీలన

సైదాపురం మండలంలోని రామసాగరంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఇటీవల మండల వ్యవసాయ శాఖ అధికారిణి హైమవతి తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకోవాలంటే ఇ-పంట నమోదు అవసరమని రైతులకు చెప్పాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, వ్యవసాయాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

### చేజర్లలో యుటిఎఫ్‌కు కొత్త కార్యవర్గం

చేజర్ల మండల యుటిఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్)కు ఈనెల 19న కొత్త కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షునిగా ఏ.సుబ్రహ్మణ్యం, అధ్యక్షునిగా ఆర్.వెంకటకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఏ.వెంకటేశ్వర్లు, షేక్ షకీలా, ప్రధానకార్యదర్శిగా నాగినేని రమణయ్య, కోశాధికారిగా ఎన్.బుజ్జయ్య ఎన్నికయ్యారు.



# ద్వితీయ వర్ధంతి

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి

## శ్రీమతి ఆదాల సుశీలమ్మ గారు

పరమపదించి తేది.24-11-2023 నాటికి రెండేళ్ళు
గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు

**ఆదాల ప్రభాకర్‌రెడ్డి**
పార్లమెంటు సభ్యులు, నెల్లూరు

**ఆదాల మురళీకృష్ణారెడ్డి**
చైర్మెన్, MAK గ్రూప్

కుమార్తెలు

**గునుపాటి శ్యామల**
**బిరుదవోలు జలజ**

మనుమలు

**ఆదాల వంశీకృష్ణారెడ్డి**
**ఆదాల దామోదర్‌రెడ్డి**



# శ్రద్ధాంజలి

ప్రజాసేవలో ధన్యం మీ జీవితం
ప్రజలు మరువరు మీ సేవలు

## కీ॥ శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు

ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

**28వ వర్ధంతి సందర్భంగా**
**వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...**

**కుటుంబ సభ్యులు**
**మరియు బంధుమిత్రులు**

తేది: 1-12-2023 శుక్రవారం ఉ॥ 10.30 గం॥లకు నెల్లూరు, పొగతోటలోని M1 సినిమాస్(S2 సినిమాస్)లో
**మహనీయులు కీ॥శే॥ మాగుంట సుబ్బరామరెడ్డి గారికి స్మృత్యంజలి ఘటిస్తారు.**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com